

విశాఖకు మరో రెండు వందేభారత్ రైళ్లు

- పూరి-విశాఖ-పూరి ఒకటి
- సికింద్రాబాద్-విశాఖ మధ్య అదనంగా మరొకటి



ఉత్తరాంధ్ర ప్రజలకు మరో రెండు వందే భారత్ రైళ్లు అందుబాటులోకి రానున్నాయి. ఈ రెండు విశాఖపట్నం నుంచి నడుస్తాయి. పూరి-విశాఖపట్నం స్టేషన్ల మధ్య ఒకటి, విశాఖపట్నం-సికింద్రాబాద్ మధ్య మరొకటి అదనంగా రానుంది.

- వివరాలు మెయిన్ ఎడిషన్‌లో...



భక్త జనసంద్రం

- మహా శివరాత్రి పుణ్య స్నానాలకు పోటెత్తిన భక్తులు
- కిక్కిరిసిన ఆర్‌కే బీచ్

మహా శివరాత్రి జాగరణ అనంతరం పవిత్ర సముద్ర స్నానాలకు భక్తులు పోటెత్తారు. నగరంలో పలు బీచ్‌లతో పాటు భీముని పట్నం, యారాడ, అప్పికొండ తీరానికి వెల్లువలా తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచి సముద్రంలో స్నానాలు ఆచరించి, సూర్య నమస్కారాలు చేశారు. అనంతరం శైవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కాగా భక్తులకు ఇబ్బందులు ఎదురవకుండా అధికారులు చర్యలు చేపట్టగా, స్నానాల సందర్భంగా ప్రమాదాలు సంభవించకుండా పోలీసులు రక్షణ చర్యలు కల్పించారు.



సిట్టింగ్‌లకు లైన్‌క్లియర్

- సమన్వయకర్తలకు కూడా...
- ఉత్తరాంధ్ర ఎమ్మెల్యేలు, సమన్వయకర్తల సమావేశంలో వైసీపీ అధిష్ఠానం సంకేతాలు
- చివరి నిమిషంలో ఒకటి, రెండు మార్పులు ఉండవచ్చునంటున్న నేతలు

విశాఖపట్నం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): వైఎస్ఆర్ కాంగ్రెస్ తరఫున వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులెవరనే దానిపై అధిష్ఠానం స్పష్టత ఇచ్చిందని పార్టీలో ప్రచారం జరుగుతోంది. ఉత్తరాంధ్రలోని ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలతో తాడేపల్లిలో పార్టీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి వైవీ సుబ్బారెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఉమ్మడి విశాఖ జిల్లాలో తూర్పు నియోజకవర్గం నుంచి సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ, 'నార్త్' నుంచి కేకే రాజు, పశ్చిమ నియోజకవర్గం నుంచి సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్, అనకాపల్లి నుంచి మలసాల భరత్‌కుమార్, పాడేరు నియోజకవర్గం నుంచి సమన్వయకర్త మత్స్యరాస విశ్వేశ్వరరరాజు, అరకులోయ నుంచి సమన్వయకర్త రేగం మత్స్యలింగంతోపాటు మిగిలిన నియోజక వర్గాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలే (భీమిలి-ముత్తంశెట్టి శ్రీనివాసరావు, 'సౌత్'-వాసుపల్లి గణేష్‌కుమార్, ఎలమంచిలి-కన్నబాబు రాజు, నర్సీపట్నం-పెట్ల ఉమాశంకర్‌గణేష్, పెందుర్తి-అదీప్‌రాజ్) తిరిగి పోటీలో ఉంటారని అధిష్ఠానం సంకేతాలు ఇచ్చినట్టు పార్టీలో ప్రచారం జరుగుతోంది. అయితే చివరి నిమిషంలో ఒకటి, రెండు మార్పులు జరిగినా ఆశ్చర్యపోనవసరం లేదని నేతలు పేర్కొంటున్నారు.

వైసీపీ సేవలో ఆర్టీసీ

- మేదరమెట్ల సిద్ధం సభకు ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి 200 బస్సులు
- రెండు రోజుల పాటు ప్రయాణికులకు ఇబ్బందులే

ద్వారకా బస్‌స్టేషన్, మార్చి 9: ప్రకాశం జిల్లా మేదరమెట్లలో ఆదివారం వైసీపీ నిర్వహించనున్న 'సిద్ధం' సభకు ఆర్టీసీ (ప్రజా రవాణా శాఖ...పీటీడీ) అధికారులు ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి 200 బస్సులను కేటాయించారు. విశాఖపట్నం రీజియన్‌లోని ఏడు డిపోల నుంచి 150, అనకాపల్లి రీజియన్‌లోని రెండు డిపోల నుంచి 50 బస్సులు ఇచ్చారు. ఈ బస్సులు శనివారం మధ్యాహ్నం నుంచి దశల వారీగా వెళ్లాయి. గుంటూరు, కృష్ణా, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని వివిధ నియోజకవర్గాల నుంచి పార్టీ కార్యకర్తలను, సాధారణ ప్రజానీకాన్ని తరలించేందుకు ఈ బస్సులు వినియోగించనున్నట్టు తెలిసింది. వైసీపీ నాయకులు ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం ఈ బస్సులు ఆదివారం ఉదయానికి నిర్దేశిత ప్రాంతాలకు చేరుకుని, అక్కడ నుంచి మేదరమెట్ల సభకు జనాలను తరలించాలి. సభ ముగిసిన తరువాత పార్టీ శ్రేణులను తిరిగి వారి స్వస్థలాలకు చేర్చాలి. ఆ తరువాత అక్కడ నుంచి బయలుదేరి సోమవారం మధ్యాహ్నానికి విశాఖపట్నం చేరుకుంటాయి.

ఉమ్మడి విశాఖ జిల్లాలో శనివారం మధ్యాహ్నం నుంచి సోమవారం మధ్యాహ్నం వరకూ రెండు వందల బస్సులు అందుబాటులో ఉండవు. ఆ ప్రభావం ప్రయాణికులపై పడనున్నది. ఆది, సోమవారాల్లో శుభకార్యాలకు ముహూర్తాలు ఉండడంతో ప్రయాణికుల రాకపోకలు ఎక్కువగా ఉంటాయి.ఇలాంటి సమయంలో ప్రయాణికుల రద్దీకి తగ్గట్టుగా ప్రత్యేక సర్వీసులు నడపాల్సిన పీటీడీ...ఉన్న బస్సులనే ఎక్కడో నాలుగు జిల్లాల అవతల జరుగుతున్న వైసీపీ సభలకు జనాలను తరలించేందుకు కేటాయించడం ఏమిటనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ రవాణా శాఖ అధికార పార్టీ సేవలో తరించడం సరికాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

కలిసికట్టుగా...

టీడీపీ, జనసేన, బీజేపీ మధ్య పొత్తు

- ఉమ్మడి విశాఖ జిల్లాలో సీట్ల సర్దుబాటుపై రకరకాల ఊహాగానాలు
- బీజేపీకి అరకులోయ ఎంపీ స్థానం అభ్యర్థినిగా కొత్తపల్లి గీత పేరు పరిశీలన
- అనకాపల్లి ఎంపీ సీటు కూడా ఇస్తారనే ప్రచారం
- విశాఖపట్నం సీటు అడిగిన కమలనాథులు
- ఇవ్వలేమన్న టీడీపీ అధినేత
- అసెంబ్లీ స్థానాల్లో ఇప్పటికే జనసేనకు నాలుగు కేటాయింపు
- బీజేపీకి విశాఖ నార్త్?

వచ్చే ఎన్నికల్లో కలిసి పోటీ



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

వచ్చే ఎన్నికల్లో కలిసి పోటీ చేయాలని తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీలు నిర్ణయించాయి. తాజాగా ఢిల్లీలో సీట్ల సర్దుబాటుపై చర్చలు పూర్తయ్యాయి. రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసీపీని ఓడించడానికి మూడు పార్టీలు సమన్వయంతో పనిచేయాలని అంగీకారానికి వచ్చాయి. 2014 ఎన్నికల్లో ఎలాగైతే మూడు పార్టీలు కలిసి అధికారంలోకి వచ్చాయో ఇప్పుడు అదే పునరావృతం కావాలని బలంగా కోరుకుంటున్నాయి. మూడు పార్టీల మధ్య పొత్తు నేపథ్యంలో ఎవరెక్కడ పోటీ చేస్తారనే చర్చ విస్తృతంగా నడుస్తోంది. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో మూడు లోక్‌సభ స్థానాలు (విశాఖపట్నం, అనకాపల్లి, అరకు), 15 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. వీటిని ఎలా పంచుకోవాలి?... అనే దానిపై చర్చలు జరుగుతున్నాయి.

పార్లమెంటు స్థానాలపై...

అరకులోయ లోక్‌సభ స్థానాన్ని బీజేపీ ముందు నుంచి కోరుతోంది. గతంలో అక్కడ వైసీపీ నుంచి ఎన్నికైన కొత్తపల్లి గీత ఆ తరువాత కాలంలో ఆ పార్టీకి రాజీనామా చేశారు. ప్రస్తుతం ఆమె బీజేపీలో ఉన్నారు. ఆ స్థానం ఆమెకు ఇస్తారని ప్రచారం జరుగుతోంది. ఇక విశాఖపట్నం లోక్‌సభ స్థానాన్ని కూడా బీజేపీ కోరుకుంది. పార్టీ అధిష్ఠానం ఆదేశం పంపించిందని చెబుతూ రాజ్యసభ సభ్యుడు ఒకరు కొన్నాళ్లుగా ఇక్కడ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అయితే గతంలో విశాఖపట్నం ఎంపీగా గెలిచిన దగ్గుబాటి పురందేశ్వరి విశాఖ స్థానం కోరుకుంటారని ప్రచారం జరిగినా...ఆమె మాత్రం తనకు రాజమండ్రి కేటాయించాలని అధిష్ఠానాన్ని అడిగినట్టు సమాచారం. టీడీపీ నుంచి బీజేపీలోకి వెళ్లిన రాజ్యసభ సభ్యుల్లో రాయలసీమకు చెందిన ఒకరు విశాఖ నుంచి పోటీకి అవకాశం ఇవ్వాలని కోరినట్టు కూడా ప్రచారం జరిగింది. అయితే ఎట్టి పరిస్థితుల్లోను విశాఖపట్నం లోక్‌సభ స్థానాన్ని బీజేపీకి ఇవ్వలేమని, గత ఎన్నికల్లో స్వల్ప తేడాతో ఓడిపోయిన 'గీతం' అధ్యక్షులు శ్రీభరత్‌నే పోటీకి దించుతున్నామని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు... బీజేపీ పెద్దలకు చెప్పేశారు. దీంతో ఉమ్మడి విశాఖలో మరో ఎంపీ స్థానం ఇవ్వాలని బీజేపీ కోరినట్టు, అలాగైతే జనసేనకు అనుకున్న అనకాపల్లి లోక్‌సభ స్థానాన్ని బీజేపీకి బదిలీ చేయాలని భావిస్తున్నట్టు తెలిసింది. ఒకవేళ అలా జరిగితే అనకాపల్లి నుంచి మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, సెయిల్ డైరెక్టర్ కాశీ విశ్వనాథరాజు, సీఎం రమేశ్‌ల పేర్లు పరిశీలిస్తున్నట్టు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. అలాగే ఆ ప్రాంతంలో బలమైన సామాజిక వర్గానికి చెందిన ముత్యాల వెంకటేశ్వరరావు (ఎంవీఆర్) పేరు కూడా బీజేపీ అధి ష్ఠానం పరిశీలనలో ఉందని ప్రచారం జరుగుతోంది. అనకాపల్లి స్థానానికి మొదట జనసేన తరఫున నాగబాబు పోటీ చేస్తారని ప్రచారం జరిగింది. ఆయన కూడా నియోజకవర్గంలో తిరిగారు. ఎందుకనో ప్రచారం ఆపేశారు. ఈ నేపథ్యంలో అనకాపల్లి ఎంపీ స్థానం బీజేపీకి ఇచ్చే అవకాశాలు ఉన్నాయనే అంటున్నారు.

అసెంబ్లీ స్థానాల సర్దుబాటు

ఉమ్మడి విశాఖ జిల్లాలో 15 అసెంబ్లీ స్థానాలు ఉండగా బీజేపీతో పొత్తు కుదరక ముందే అందులో జనసేన పార్టీకి నాలుగు ఇచ్చారు. అనకాపల్లి జిల్లాలో అనకాపల్లి, ఎలమంచిలి, పెందుర్తి/మాడుగుల స్థానాలు కేటాయించారు. అక్కడ అభ్యర్థుల ఎంపిక కూడా పూర్తయిపోయినట్టే. అనకాపల్లికి కొణతాల రామకృష్ణ, ఎలమంచిలికి సుందరపు

... మిగతా 6వ పేజీలో

ఓటర్లకు తాయిలాలు!

ప్రలోభపెట్టేందుకు వైసీపీ నాయకుల యత్నాలు

- ఇప్పటికే పంపిణీ ప్రారంభం
- సీట్లు, చీరలు, డబ్బులు...
- కులసంఘాలు, అపార్ట్‌మెంట్ అసోసియేషన్లు, ఇతర సంఘాల నేతలతో రహస్య సమావేశాలు
- ఎన్నికల్లో సహకరించాలంటూ కానుకల పంపిణీ



- తాయిలాలకు పడిపోతే భవిష్యత్తు అంధకారమే
- మంచి నేతను ఎన్నుకుంటేనే మనుగడ అంటున్న నిపుణులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

సార్వత్రిక ఎన్నికలకు సమయం సమీపిస్తోంది. మరి కొద్ది రోజుల్లో నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. రాజకీయ పార్టీలు సమరానికి సన్నద్ధమవుతున్నాయి. ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో కొంతమంది ప్రచారాన్ని కూడా ప్రారంభించారు. ఎలాగైనా విజయం సాధించేందుకు వ్యూహాలకు పదును పెడుతున్నారు. ఇందులో భాగంగా ఓటర్లకు తాయిలాలు పంచి గెలుపు గుర్రం ఎక్కాలని కొంతమంది ఉవ్విళ్లూరుతున్నారు. వర్గాల వారీగా ప్రజల అవసరాలు గుర్తించి వాటిని తీర్చడం ద్వారా గంపగుత్తగా ఓట్లను కొల్లగొట్టేందుకు ఎత్తులు వేస్తున్నారు.

ఓటర్లను వివిధ రకాలుగా ప్రలోభపెట్టడం, తాయిలాలు అందించి ఆకట్టుకునే చర్యల్లో అధికార వైసీపీ నాయకులు ముందున్నారు. ఇప్పటికే పలువురు అభ్యర్థులు భారీఎత్తున కానుకల పంపిణీని ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలు సేకరిస్తున్న నేతల అనుచరులు...యూనియన్లు, కుల సంఘాలు, అపార్ట్‌మెంట్ అసోసియేషన్ల వారీగా అవసరాలను తెలుసుకుంటున్నారు. వాటిని నెరవేర్చడం ద్వారా ఓట్లను కొల్లగొట్టే

... మిగతా 6వ పేజీలో

విద్యాశాఖలో దొడ్డిదారి బదిలీలు?

- ఏజెన్సీ నుంచి నగరం, పరిసరాల్లో గల పాఠశాలల్లో పలువురు ఉపాధ్యాయులకు పోస్టింగ్
- చక్రం తిప్పిన అధికార పార్టీ నేతలు
- రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకూ వసూలు
- త్వరలో డీఈవోకు సీల్డు కవర్‌లో ఉత్తర్వులు



విశాఖపట్నం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖలో మరోసారి దొడ్డిదారి బదిలీలకు రంగం సిద్ధమైంది. విశాఖ నగరం, చుట్టుపక్కల పాఠశాలల్లో పోస్టింగ్స్ కోసం కొందరు ఉపాధ్యాయులు అధికార పార్టీ నేతలను ఆశ్రయిస్తున్నారు. నగరంలో పోస్టింగ్ కోసం మూడు లక్షల నుంచి ఐదు లక్షల రూపాయల వరకూ సమర్పించుకుంటున్నారని ఉపాధ్యాయ వర్గాల్లో ప్రచారం సాగుతుంది. ఈ వ్యవహారంలో ముఖ్యంగా నగరంలో నివాసం ఉంటున్న ఓ కీలక ప్రజా ప్రతినిధి ప్రమేయం ఉన్నట్టు తెలుస్తోంది. ఆయన వద్ద వ్యక్తిగత సహాయకుడిగా పనిచేస్తున్న వ్యక్తే...ఈ అడ్డగోలు బదిలీల వ్యవహారం చూస్తున్నారంటున్నారు. బదిలీలకు సంబంధించిన ఉత్తర్వులు నేడో రేపో నేరుగా సీల్డ్ కవర్‌తోపాటు డీఈవో పర్సనల్ మెయిల్‌కు పంపాలని నిర్ణయించినట్టు తెలిసింది. బహుశా సోమవారం ఉదయం ఉత్తర్వులు వస్తాయని ఉపాధ్యాయ సంఘాలు అంచనా వేస్తున్నాయి.

వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అడ్డగోలుగా దొడ్డిదారిన ఉపాధ్యాయుల బదిలీలు చేయడం ఆనవాయితీగా మారిపోయింది. గడచిన ఐదేళ్లలో నాలుగైదు పర్యాయాలు పలువురు టీచర్లు రాజకీయ పలుకుబడిని ఉపయోగించుకుని దొడ్డిదారి జీవోలు తెచ్చుకున్నారు. ఈ ఏడాది జనవరిలో కొందరు ఇదేవిధంగా నగరానికి వచ్చేందుకు యత్నించారు. అయితే నగరం, పరిసరాల్లో ఎక్కువ ఖాళీలు లేకపోవడంతో కొద్దిరోజులు ఆగారు. జనవరి, ఫిబ్రవరి నెలల్లో పలువురు టీచర్లు పదవీ విరమణ చేయడంతో ఖాళీలు ఏర్పడ్డాయి. ఇప్పుడు ఆ పోస్టింగ్స్ కోసం ప్రజా ప్రతినిధి వ్యక్తిగత సహాయకుడి ద్వారా పైరవీలు చేసుకున్నారు. ఈ నేపథ్యంలోనే జిల్లాలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో గల ఖాళీల వివరాలను డీఈవో కార్యాలయం నుంచి పాఠశాల విద్యా శాఖ

... మిగతా 6వ పేజీలో

చినముషిడివాడలో భారీ చోరీ

- 20 తులాల బంగారం, 15 తులాల వెండి, 52 వేల నగదు అపహరణ

పెందుర్తి, మార్చి 9: చినముషిడివాడలో శనివారం భారీ చోరీ జరిగింది. ఇంటి ప్రధాన ద్వారం తలుపుల తాళాలు పగులగొట్టి లోపలకు ప్రవేశించిన దొంగలు బీరువాలో ఉన్న 20 తులాల బంగారు ఆభరణాలు, 15 తులాల వెండి సామగ్రి, 52 వేల నగదు అపహరించుకుపోయారు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చినముషిడివాడ పరదేశిమాంబ ఆలయ సమీపంలో చింతా శ్రీధర్ నివాసం ఉంటున్నారు. ఆయన చినముషిడివాడలో బుక్స్ అండ్ స్టేషనరీ షాపు నడుపుతున్నారు. శనివారం సాయంత్రం ఆరు గంటల సమయంలో ఆయన భార్య మణి ఇంటికి తాళం వేసి షాపు వద్దకు వెళ్లారు. రాత్రి పది గంటలకు షాపు మూసివేసి భార్యాభర్తలు ఇంటికి వచ్చేసరికి ప్రధాన ద్వారం తాళం విరిగి ఉన్నట్టు గుర్తించారు. ఇంట్లోకి వెళ్లి చూసేసరికి అంతా చిందరవందరగా ఉండడంతో పాటు బీరువా తెరిచి ఉంది. అందులో భద్రపరిచిన 20 తులాల బంగారం, 15 తులాల వెండి సామగ్రితో పాటు 52 వేల రూపాయలు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని ఆధారాలు సేకరిస్తున్నారు. బాధితుడు శ్రీధర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అప్పన్నపాలెంలో రెండిళ్లలో చోరీ

- 13 తులాల బంగారం, 200 తులాల వెండి అపహరణ

వేపగుంట సమీపంలోని అప్పన్నపాలెంలో శుక్రవారం రాత్రి పక్కపక్కనే ఉన్న రెండిళ్లలో చోరీ

... మిగతా 6వ పేజీలో

ఉన్నత పాఠశాల వద్ద పోలీసుల గస్తీ



ఎజీజీఓస్ పాఠశాల వద్ద కానిస్టేబుల్ బందోబస్తు

అక్కయ్యపాలెం, మార్చి 9: గ్రేటర్ 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలకు ఆకతాయిల బెడద ఎక్కువగా ఉండడంతో శనివారం పోలీసులు గస్తీ నిర్వహించారు. ఈ మేరకు ఒక కానిస్టేబుల్ ఉదయం, సాయంత్రం పాఠశాలకు వచ్చి పరిసర ప్రాంతాలను పరిశీలించారు.అలాగే, ఆకతాయిలు ఏ సమయంలో పాఠశాలకు వస్తున్నారో ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలకు వచ్చిన పోలీసులను గమనించిన ఆకతాయిలు పరిసర ప్రాంతాల్లో కానరా లేదు.

ఏకలవ్య కాలనీలో వయోజన విద్యాకేంద్రం ప్రారంభం



మాట్లాడుతున్న నివాసితుల సంఘ ప్రతినిధి లక్ష్మి

మాధవధార, మార్చి 9 ;మురికివాడల నివాసితుల సంక్షేమ సంఘం, ప్రగతిశీల మహిళా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో శనివారం మాధవధార ఏకలవ్యకాలనీలో సావిత్రి భాయి పూలే వయోజన విద్యాకేంద్రాన్ని ప్రారంభించారు. మురికివాడల నివాసితుల సంక్షేమ సంఘం ప్రతినిధి పి.లక్ష్మి మాట్లాడుతూ, భూ కబ్జాదారులు, అధికారుల నిర్లక్ష్య వైఖరికి వ్యతిరేకంగా పోరాడుతున్న కాలనీవాసులు అభినందనీయులన్నారు. 40 ఏళ్లుగా వీరికి ఇదే చోట సొంతిళ్లు కట్టి ఇవ్వాలని చేస్తున్న పోరాటం త్వరలోనే నెరవేరుతుందన్నారు. స్థానికులను చైతన్యవంతుల్ని చేసేదిశగావిద్యా కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సావిత్రిభాయి పూలే ట్రస్ట్ చైర్‌పర్సన్ జి.సీతామహాలక్ష్మి, లీడర్ పత్రిక సంపాదకుడు రమణమూర్తి, ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి నారాయణ వేణు, చైతన్య మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షులు లలిత, విద్యా పరిరక్షణ కమిటీ కిశోర్, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ ప్రతినిధి వై.కొండయ్య, రోహిణి, ముత్యాలు, నాగమణి పాల్గొన్నారు.

యమపాశాల్లా కేబుల్ తీగెలు

- మురళీనగర్ పరిధిలో రోడ్లకు అడ్డంగా ఫైబర్ కనెక్షన్, విద్యుత్ తీగలు

మురళీనగర్, మార్చి 9: ప్రధాన రహదారుల నుంచి కాలనీలకు వెళ్లే రోడ్లపై గుట్టలుగా వేలాడుతున్న వివిధ తీగెలు ప్రయాణికుల పాలిట యమపాశాల్లా మారాయి. ఓవైపు కేబుల్ వైర్లు కనపించకుండా జీవీఎంసీ స్మార్ట్ సిటీ పేరిట చేపడుతున్న పనులు క్షేత్రస్థాయిలో ఫలితాలనివ్వడం లేదు. విద్యుత్, యూజీడీ పైపులు... టెలికం ఫైబర్ కేబుల్స్ భూగర్భం నుంచే అమర్చి రహదారులను సుందరంగా మార్చుతామని రాజకీయ నాయకులు, అధికారులు చేస్తున్న ప్రకటనలకు కాలనీల్లోని పరిస్థితికి పొంతన కుదరటం



కళింగనగర్‌లో రోడ్డుకు అడ్డంగా కేబుల్ వైర్లు



స్తంభానికి చుట్టుకుని...

లేదు. విశాఖ ఉత్తర నియోజకవర్గంలో మురళీనగర్, మాధవధార ఉడాకాలనీలతో సహా ప్రభుత్వ కార్యాలయాలు అధికంగా ఉండే మర్రిపాలెం, మురళీనగర్ ప్రాంతాల్లో కేబుల్ తీగలు ఎక్కడికక్కడ వేలాడుతూ దర్శనమిస్తున్నాయి. ఇవి నిత్యం రాకపోకలు సాగించే వారికి ప్రమాద భరితంగా మారాయి. కేబుల్ తీగెలు స్తంభాలనుంచి రహదారుల వరకు వస్తున్నాయి. కొన్ని



ఉడాకాలనీలో బైక్ రైడర్స్‌కు ప్రమాదకరంగా..

చోట్ల అడ్డంగా ఉంటున్నాయి. 48ఏ బస్సు రూట్‌లో ఇటీవల రోడ్డుపై వేలాడిన తీగెలను ప్రయాణికులు వాహనాలు నిలిపి సరిచేసుకున్నారు. కళింగనగర్‌లో ఎస్‌బీఐ బ్యాంకు, ఏటీఎం కేంద్రాల వద్ద నిత్యం తీగెలు కాళ్లకు చిక్కుకుని పడిపోతున్నారు. వాహనదారులు ప్రమాదాలు చవిచూస్తున్నారు.

ఆర్‌జేడీ విజయభాస్కర్‌ను కలిసిన ఆపస్ నాయకులు

అక్కయ్యపాలెం, మార్చి 9: పాఠశాల విద్యాశాఖ విశాఖపట్నం రీజనల్ జాయింట్ డైరెక్టర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన విజయభాస్కర్‌ను ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఏపీయూ ఎస్) నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పూల మొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనను కలిసిన వారిలో



ఆర్‌జేడీకి పూలమొక్క అందిస్తున్న నాయకులు

సంఘం జిల్లా అధ్యక్షుడు అరుణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి త్రినాధమూర్తి, కోశాధికారి, నగర ప్రధాన కార్యదర్శి ఎంఎస్‌వీ విశ్వనాథం, నారాయణరావు ఉన్నారు.

ఘనంగా దుర్గాలమ్మ జాతర

పూర్ణామార్కెట్, మార్చి 9: వన్‌టౌన్ పరిధిలో దుర్గాలమ్మ జాతర మహోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈసందర్భంగా పూర్ణామార్కెట్ ఏరియాలో స్థానిక యువకులు భక్తులకు ప్రసాద వితరణ చేశారు. వైసీపీ వార్డు అధ్యక్షుడు ఎ. కనకరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ఈ ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో వార్డు నాయకులు సుబ్రహ్మణ్యం, ఎం.వెంటక విజయ్, చిట్టిబోయిన విజయ్, పి.రమణమ్మ, పిల్లి చిన్ని, నాగేశ్ పాల్గొన్నారు.

పేదలకు అండగా ఉంటాం

- టీడీపీ 'దక్షిణ' ఇన్‌చార్జి గండి బాబ్జీ



మాట్లాడుతున్న గండి బాబ్జీ

విశాఖపట్నం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పేద వర్గాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని టీడీపీ దక్షిణ ఇన్‌చార్జి గండి బాబ్జీ అన్నారు. శనివారం వన్‌టౌన్‌లోని 39వ వార్డు కోటవీధి ఫెర్రీరోడ్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సుమారు 600మంది పేద ముస్లిం, హిందూ కుటుంబాలకు రంజాన్‌తోఫా కింద నిత్యావసరాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింలకు ఏటా టీడీపీ హయాంలో రంజాన్ తోఫా కింద నిత్యావసరాలు అందజేసినట్టు గుర్తుచేశారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో తిరిగి అధికారంలోనికి వచ్చిన తరువాత ముస్లింలకు పెద్దపీట వేస్తామన్నారు. కోటవీధికి చెందినలడ్డూబాయ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు, వార్డు అధ్యక్షులు, క్లస్టర్‌ఇన్‌చార్జిలు, కార్యకర్తలున్నారు.

భాను స్ట్రీట్‌లో ఆక్రమణలతో అవస్థలు



సాయంత్రంవేళ రోడ్డుపక్కన ఫుడ్ పాయింట్లు, వాహనాలు

డాబాగార్డెన్స్, మార్చి 9: జీవీఎంసీ 31వ వార్డు పరిధి భానుస్ట్రీట్ సాయంత్రం వేళలో రద్దీగా మారిపోతోంది. రోడ్డు పక్కన పలువురు వ్యాపారుల ఫుడ్ పాయింట్స్ ఆక్రమణలతో నిండిపోతోంది. సాయంత్రం 4 నుంచి రాత్రి వరకు ఇక్కడి రహదారిపై ఫుడ్‌పాయింట్స్‌లో విక్రయాలు చేపడుతుండంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. దుకాణాల ఎదుట కొనుగోలుదారులు, వారి వాహనాలతో స్థానికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏదైనా భారీ వాహనాలు వస్తే... ట్రాఫిక్ అంతరాయం తప్పడం లేదు. దీంతో పాటు రోడ్డుపైనే తిన్న కొన్ని పేపర్ ప్లేట్లు సైతం ఎగిరిపోతున్నాయి. సంబంధిత అధికారులు కనీసం పట్టించుకోకపోవడంపై విమర్శలు తలెత్తుతున్నాయి. ఇకనైనా ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని ఈ సందర్భంగా పలువురు స్థానికులు కోరుతున్నారు.

హోల్‌సేల్ మార్కెట్‌లో పబ్లిక్ టాయిలెట్స్ ప్రారంభం

జ్ఞానాపురం, మార్చి 9: కాన్వెంట్ కూడలిలోని హోల్‌సేల్ మార్కెట్‌లో ఉన్న సమస్యలపై ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. శనివారం మార్కెట్‌లో ఉన్న పబ్లిక్ టాయిలెట్‌లను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ ప్రారంభించారు.

కలిసికట్టుగా...

... 5వ పేజీ తరువాయి

విజయకుమార్, పెందుర్తి పంచకర్ల రమేశ్‌బాబు పేర్లు ఖరారయ్యాయి. విశాఖ జిల్లాకు వచ్చేసరికి దక్షిణం సీటు జనసేనకు ఇచ్చారు. అక్కడి నుంచి ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ పోటీ చేస్తారని ప్రచారం జరుగుతోంది. ఇప్పుడు బీజేపీ కూడా కొన్ని అసెంబ్లీ స్థానాలు కోరుతోంది. గతంలో 2014లో టీడీపీ, బీజేపీ కలిసి పోటీ చేసినప్పుడు విశాఖ ఉత్తర నియోజకవర్గం నుంచి విష్ణుకుమార్‌రాజు ఎమ్మెల్యేగా గెలుపొందారు. గత 2019 ఎన్నికల్లో ఆయన పోటీ చేసి ఓడిపోయారు. ఇప్పుడు మళ్లీ పోటీ చేయడానికి ప్రచారం కూడా ప్రారంభించారు. ఉమ్మడి విశాఖలో బీజేపీకి ఏమైనా అసెంబ్లీ స్థానాలు ఇచ్చినట్టయితే అందులో మొదటిది విశాఖ ఉత్తర నియోజకవర్గమే అవుతుందని ఆ పార్టీ నాయకులు అంటున్నారు. బీజేపీలో రాష్ట్ర కోశాధికారి ఎం.నాగేంద్ర, నగర పార్టీ అధ్యక్షులు మేడపాటి రవీంద్ర, అధికార ప్రతినిధి సుహాసినీ ఆనంద్, బీజేపీ యువమోర్చా నాయకుడు సురేంద్రమోహన్ వంటివారు ఈసారి ఎన్నికల్లో పోటీ చేయాలని భావిస్తున్నారు. ఇంకా ఏమైనా అదనంగా అసెంబ్లీ స్థానాలు కేటాయిస్తే వారిలో ఎవరికైనా ఛాన్స్ దక్కవచ్చు.

ఓటర్లకు తాయిలాలు!

... 5వ పేజీ తరువాయి

వ్యూహాలు రచిస్తున్నారు. ఇందుకోసం ఎంత ఖర్చయినా భరించేందుకు కూడా సిద్ధమవుతున్నారు.

వైసీపీ కానుకల పంపిణీ

నగరంలోని పలువురు వైసీపీ నాయకులు కానుకల పేరుతో మహిళలకు చీరలను పంపిణీ చేస్తున్నారు. కొద్దిరోజుల కిందట ఇంటింటికీ స్వీట్ బాక్సులను అందించారు. ఓ కీలక నేత ఓటర్లకు దుస్తులు పంపిణీ చేయడంతో పాటు మహిళలకు చీరలు, ఇతర ఖర్చులకు రూ.500 చొప్పున పంపిణీ చేశారు. ప్రలోభాలకు ఓటర్లు లొంగిపోతే రానున్న రోజుల్లో ఈ నాయకులు మరింత రెచ్చిపోతారనే వాదన వినిపిస్తోంది.

అవసరాలు తెలుసుకుని..

వచ్చే ఎన్నికల్లో విజయం కోసం ప్రయత్నిస్తున్న కీలక నేతలు..వ్యక్తిగతంగా ప్రతి ఓటరును కలుస్తూనే..గంప గుత్తగా పడే ఓట్లపై దృష్టి సారించారు. ఇందుకు కుల, వృత్తి సంఘాలు, అసోసియేషన్లను ఎంచుకుంటున్నారు. ఆయా సంఘాల ముఖ్య నాయకులతో సమావేశమై వారి అవసరాలను తీరుస్తామని, ఎన్నికల్లో సహకరించాలని కోరుతున్నారు. ఇందుకోసం ఒక్కో నేతకు క్షేత్రస్థాయిలో రెండు, మూడు బృందాలు పనిచేస్తున్నాయి. వీరంతా నియోజకవర్గ పరిధిలోని కీలక సంఘాలు, అసోసియేషన్ల ప్రతినిధులతో సమావేశం కావడం, వారి అవసరాలను తెలుసుకుని పోటీలో ఉన్న నేతకు తెలియజేస్తున్నారు. ప్రస్తుతం నగర పరిధిలోని మూడు నియోజకవర్గాలకు చెందిన అధికార పార్టీ నేతలు ఇదే పనిలో ఉన్నట్టు సమాచారం. ఖర్చుకు వెనుకాడని ఈ నాయకులు యువతపైనా దృష్టిసారిస్తున్నారు. క్రికెట్ కిట్లు, వాలీబాల్, బ్యాడ్మింటన్, టెన్నిస్ కిట్లతో వారిని ప్రలోభపెట్టి తమ వైపు తిప్పుకునేందుకు ఆపసోపాలు పడుతున్నారు.

తాయిలాలకు లొంగిపోతే...అంతే!

ఎన్నికల సమయంలో నేతలు పంచే డబ్బు, ఇతర ప్రలోభాలకు లొంగిపోతే ఐదేళ్ల పాటు జీవితం అస్తవ్యస్తమవుతుందనే విషయాన్ని ఓటర్లంతా గుర్తుంచుకోవాలని మేధావులు సూచిస్తున్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండే నేతలను ఎన్నుకుంటే మేలు జరుగుతుందని, పిల్లల భవిష్యత్తు మెరుగుపడుతుందని చెబుతున్నారు. ప్రస్తుత పాలకుల హయాంలో కనీస అవసరాలైన నీరు, రోడ్లు, విద్యుత్ తదితర సమస్యల పరిష్కారానికి కృషి జరుగుతోందా?, అభివృద్ధి పనులు చేపడుతున్నారా?...వంటి విషయాలను పరిగణనలోకి తీసుకుని ఓటు వేయాలంటున్నారు. ప్రలోభాలకు, తాయిలాలకు లొంగిపోయి అసమర్థలను గెలిపిస్తే భవిష్యత్తు అంధకారం అవుతుందని ఆంధ్ర విశ్వవిద్యాలయం విశ్రాంత ప్రొఫెసర్ పరమేశ్వరరావు హెచ్చరిస్తున్నారు.

విద్యాశాఖలో దొడ్డిదారి బదిలీలు?

... 5వ పేజీ తరువాయి

కమిషనరేట్ అధికారులు తెప్పించుకున్నారు. ఎన్నికల ముందు బదిలీ ఉత్తర్వులు తెచ్చుకోకపోతే తరువాత కష్టమని భావించిన టీచర్లు కొందరు పోస్టింగ్స్ కోసం రూ.లక్షలు ఇచ్చినట్టు తెలిసింది. గత ఏడాది సాధారణ బదిలీల్లో సుమారు 300 మంది ఉపాధ్యాయులు అల్లూరి సీతారామరాజు జిల్లాకు బదిలీ అయ్యారు. వీరిలో ఎక్కువ మంది మహిళలు ఉన్నారు. ఉద్యోగం వచ్చినప్పటి నుంచి పలు రకాల కారణాలతో విశాఖ, అనకాపల్లి పరిసరాల్లో పనిచేసిన టీచర్లు ఏజెన్సీకి బదిలీపై వెళ్లాల్సి వచ్చింది. ఎలాగైనా అక్కడ నుంచి తిరిగి మైదానం అది కూడా విశాఖ పరిసరాలకు వచ్చేయాలని...అప్పటి నుంచి పైరవీ చేస్తున్నారు. గత ఏడాది కొద్దిమంది ఏజెన్సీ నుంచి మైదానానికి వచ్చేశారు. ఇందుకు రెండు లక్షల నుంచి మూడు లక్షల రూపాయల వరకూ ఖర్చు చేశారు. ఇప్పుడు కూడా ఏజెన్సీలో ఉన్న పలువురు టీచర్లు నగరానికి వచ్చేందుకు తమకు తెలిసిన అధికార పార్టీ నేతల ద్వారా నగరంలోని ప్రజా ప్రతినిధి, ఆయన వ్యక్తిగత సహాయకుడికి చెప్పించుకున్నారని ప్రచారం సాగుతుంది. అయితే దొడ్డిదారి బదిలీలకు సంబంధించిన వివరాలను బయటకు చెప్పకుండా విద్యాశాఖ గోప్యత పాటిస్తోంది. కాగా ఎన్నికల ముందు దొడ్డిదారిలో బదిలీలకు ప్రభుత్వం నిర్ణయించడంపై ఉపాధ్యాయ సంఘాలు మండిపడుతున్నాయి. ఏళ్ల తరబడి శివారు ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు నగరంలో పనిచేసేందుకు అవకాశం ఇవ్వాలి తప్ప పలుకుబడి ఉన్నవారికి ప్రాధాన్యం ఇస్తే ఎలాగని ప్రశ్నిస్తున్నారు.

చినముషిడివాడలో భారీ చోరీ

... 5వ పేజీ తరువాయి

జరిగింది. ఇళ్ల తాళాలు పగులగొట్టి 13 తులాల బంగారం, 200 తులాల వెండి సామగ్రిని దొంగలు ఎత్తుకుపోయారు. వివరాలిలా ఉన్నాయి. అప్పన్నపాలేనికి చెందిన శ్రీధర్ హెచ్‌పీసీఎల్ కాంట్రాక్టర్. శుక్రవారం ఇంటికి తాళం వేసి పనిపై బయటకు వెళ్లారు. రాత్రి పది గంటలకు తిరిగి వచ్చారు. ఇంటి తాళం పగులగొట్టి ఉండడంతో లోపలకు వెళ్లి చూడగా బీరువాలో ఉంచిన మూడు తులాల బంగారం, వంద తులాల వెండి వస్తువులు కనిపించలేదు. అలాగే ఆ పక్కనే ఉంటున్న రాజారావు ఈ నెల ఆరున కుటుంబంతో సహా అన్నవరం వెళ్లారు. శుక్రవారం రాత్రి ఎనిమిది గంటలకు వచ్చేసరికి ఇంటి తలుపులు బద్దలగొట్టి ఉన్నాయి. బీరువాలో భద్రపరిచిన పది తులాల బంగారం, వంద తులాల వెండి సామగ్రి మాయమయ్యాయి. దీంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ఈ రెండు చోరీలు ఒకే తరహాలో జరగాయని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు కేసులు నమోదు చేసి వారు దర్యాప్తు చేస్తున్నారు. రెండు రోజుల వ్యవధిలోనే మూడిళ్లలో చోరీ జరగడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు.

'తెలుగుదేశంతోనే రాష్ట్రాభివృద్ధి'



ఆర్‌టీ క్లబ్ డౌన్ రోడ్డులో కరపత్రాల పంపిణీలో నేతలు

డాబాగార్డెన్స్, మార్చి 9: తెలుగుదేశం ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యపడుతుందని గ్రేటర్ 31వ వార్డు టీడీపీ అధ్యక్షుడు సారిపల్లి మహేశ్ పేర్కొన్నారు. శనివారం వార్డులోని ఆర్టీ క్లబ్ డౌన్, లలితాకాలనీ, గొల్లలపాలెం ప్రాంతాల్లోని టీడీపీ అధినేత చం ద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన యువతకు నిరుద్యోగభృతి, ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15 వేలు, రైతుకు ఏటా ఆర్థిక సాయం, ప్రతి ఇంటికి మూడు గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచితబస్సు ప్రయాణం, నెలకు రూ.1, 500 పథకాలను ఇంటింటా వివరించారు. వార్డు క్లస్టర్ ఇన్‌చార్జి వానపల్లి గాయత్రిఫణికుమారి, భద్రమాని రమాదేవి, ఎండీ ఇలియాస్, గరికిన ఎల్లాజీ, అట్టాడ అప్పారావు, హేమలత, కె.శంకరరావు, పల్లా శ్రీను, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతమ్మధార: బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం కృషి చేసిన చంద్రబాబు నాయుడును మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని 24వ వార్డు టీడీపీ బూత్ ప్రెసిడెంట్, ఎస్సీ నాయకుడు వంగలపూడి నూకరాజు పిలుపునిచ్చారు. వార్డు టీడీపీ అధ్యక్షురాలు బర్ల పద్మలత ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ, సూపర్ సిక్స్ బ్రోచర్లను పంపిణీ చేశారు.

చాకలిపేట ప్రాంతంలో రహదారుల నిర్మాణం

పూర్ణామార్కెట్, మార్చి 9: వన్‌టౌన్ 30వ వార్డు మెయిన్ రోడ్డు ఆంజనేయస్వామి గుడి నుంచి కేజీహెచ్ ఓపీ గేటుకు వెళ్లే లింక్ రోడ్డు, చాకలిపేట రోడ్లను అభివృద్ధి చేశారు. ఇటీవల పత్రికల్లో కథనాల రావడంతో జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు, వార్డు కార్పొరేటర్ కోడూరు అప్పలరత్నం స్పందించారు. పూర్తిగా గతుకులమయంగామారిన రహదారులను మరమ్మతులు చేపట్టారు.



పూర్తయిన సీసీ రోడ్డు

సమష్టిగా వాకర్స్‌క్లబ్ అభివృద్ధి

మురళీనగర్, మార్చి 9; మురళీనగర్ వాకర్స్‌క్లబ్ సమష్టి కృషితో సమగ్ర పురోగతి సాధిస్తుందని క్లబ్ ప్రెసిడెంట్ పల్లా.చంద్రమౌళి పేర్కొన్నారు. శనివారం క్లబ్ నెలవారీ నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం కొత్త సభ్యులతో ప్రమాణ స్వీకారం చేపట్టారు. దామోదరం సంజీవయ్య న్యాయ విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసరు పి.వరలక్ష్మి ముఖ్యఅతిథిగా హాజరై క్లబ్ సేవలను కొనియాడారు. క్లబ్ కార్యదర్శి పి.చెల్వరాజు, వాకర్స్ క్లబ్ ఇంటర్నేషనల్ అడిషనల్ సెక్రటరీ ఆర్.సత్యనాధం, పూర్వ అధ్యక్షులు ఎస్.బుచ్చయ్య, కె.ద్వారకానాథ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రెసిడెంట్ పల్లా.చంద్రమౌళి

జాతీయ సదస్సుకు 'నరవ'కు ఆహ్వానం

డాబాగార్డెన్స్, మార్చి 9: బెంగళూరు నగరం కేంద్రంగా పనిచేస్తున్న ఇండియన్ సోషల్ ఇనిస్టిట్యూట్ జాతీయ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి 16 వరకు జరగనున్న 'వలస కార్మికుల సమస్య-వీటి నివారణకు సూచనలు' అంశంపై జాతీయ సదస్సుకు నగరానికి చెందిన నరవ ప్రకాశరావుకు ఆహ్వానం అందించింది. బాల వికాస్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక కార్యదర్శిగా ఆయన ఈ సదస్సులో వ్యాసం సమర్పించనున్నారు.




నరవ ప్రకాశరావు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

జ్ఞానాపురం, మార్చి 9: జీవీఎంసీ 41వ వార్డు పరిధిలోని బాబూకాలనీ, జెఎస్‌ఎస్ఎంఆర్‌యూ కాలనీలలో రూ. 33లక్షలతో రిటైనింగ్ వాల్, సీసీ రోడ్ల నిర్మాణ పనులకు కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ మెంబరు కోడిగుడ్ల పూర్ణిమ, క్లస్టర్ ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్ శనివారం శంకుస్థాపన చేశారు. జ్ఞానాపురంఎర్రిగెడ్డలో చెత్తను ఎప్పటికప్పుడు ట్రక్కుల్లో లోడుచేసేందుకు వీలుగా రూ. 1.89 కోట్లతో ఏర్పాటు చేసిన పవర్ ఆపరేటెడ్ మెకానికల్ ఎస్కవేటర్ స్క్రీన్‌లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ ఏఈ సతీశ్,నాయకులు వెలంగిణిరావు, అన్నపూర్ణ, దేవి, ఈశ్వరి, శ్యామ్‌సుందర్ పాల్గొన్నారు.

కంచరపాలెం: 48వ వార్డు పరిధి కొండవాలు ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఉత్తర వైసీపీ నాయకుడు కె.కె.రాజు శనివారం పరిశీలించారు. సీసీ రోడ్లు, కాలువలు, రిటర్నింగ్ వాల్స్ తదితర పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. కొండవాలు ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


గవరం జగ్గయ్యపాలెంలో అసంపూర్తిగా నిర్మించిన డ్రైనేజీ

అసంపూర్తిగా డ్రైనేజీ నిర్మాణం

లోతట్టు ప్రాంతంలో పేరుకుపోయిన మురుగు

తీవ్ర దుర్వాసన, దోమల విజృంభణ

జ్వరాల బారినపడుతున్న ప్రజలు

గోపాలపట్నం, మార్చి 9: అసంపూర్తి డ్రైనేజీ నిర్మాణం వల్ల మురుగు నీరు పేరుకుపోయి జ్వరాలు ప్రబలుతున్నాయని గవర జగ్గయ్యపాలెం గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. 88వ వార్డు గవర జగ్గయ్యపాలెంలో ఇటీవల పలు వీధుల్లో మురుగునీటి కాలువల నిర్మాణ పనులు చేపట్టారు. అయితే గ్రామంలోని పలు వీధుల నుంచి వచ్చే మురుగు నీరు ప్రధాన కాలువకు కలిసేలా అనుసంధానం చేయకపోవడంతో లోతట్టు ప్రాంతంలో మురుగు నీరు నిల్వ ఉండిపోయింది. రోజుల తరబడి మురుగు పేరుకుపోవడంతో పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర దుర్గంధంతో అవస్థలు పడుతున్నారు. దోమలు విజృంభిస్తుండడంతో ఇటీవల సుమారు పది మంది జ్వరాల బారిన పడ్డారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో నిర్మించిన కాలువలను ప్రధాన కాలువకు అనుసంధానం చేసేందుకు తగిన చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

60వ వార్డులో చిల్డ్రన్ పార్కు ప్రారంభం


పార్కును ప్రారంభిస్తున్న ఆనంద్‌కుమార్, రత్నరాజ్

మల్కాపురం, మార్చి 9: గ్రేటర్ 60వ వార్డు ఎంబీజీ క్వార్టర్స్‌లో హెచ్‌పీసీఎల్ యాజమాన్యం సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా రూ.40 లక్షలతో నిర్మించిన చిల్డ్రన్ పార్కును శనివారం వైసీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్, హెచ్‌పీసీఎల్ ఈడీ రత్నరాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. చిన్నారులు, వృద్ధులకు ఆహ్లాదం అందించేందుకు ఈ పార్కు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పీవీ సురేశ్, హెచ్‌పీసీఎల్ జీఎం కిరణ్‌కుమార్, పీఆర్‌వో కాళీ, జీవీఎంసీ ఈఈ ప్రసన్న, డీఈ ఏడుకొండలు, వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

పెదగంట్యాడ, మార్చి 9: జీవీఎంసీ 65వ వార్డు పరిధి వాంబేకాలనీ స్వయంభు వేంకటేశ్వరాలయంలో శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. సుప్రభాత సేవ అనంతరం శ్రీవాకిళ తులసీదళార్చన, అలంకరణ, వివిధ రకాల నైవేద్యాన్ని సమర్పించారు. స్వామివారిని ప్రియదర్శనీ కాలనీ, అశోక్‌నగర్, గిరిజాకాలనీ ప్రాంతాలకు చెందిన భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన చేపట్టారు. ఆలయ ధర్మకర్త మంత్రి మంజుల, చైర్మన్ దొడ్డి రమణ, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **భీమా :** మెలోడి, సంగం, శ్రీరామ, శారద, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య-2 (గాజువాక), నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్-2 (పెందుర్తి), సీతారామయ్య (పరవాడ), రాములమ్మ (తగరపువలస)

● **గామి :** జగదాంబ, శరత్, కామేశ్వరి, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), గణేష్ (తగరపువలస), నటరాజ్ (పెందుర్తి), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం),

● **ప్రేమలు :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీ (గాజువాక), సప్తగిరి (తగరపువలస)

● **ఇంటి నెం.13 :** రమాదేవి, మోహిని (గాజువాక)

● **ఆపరేషన్ వాలెంటైన్ :** రమాదేవి, మౌర్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)

● **ఊరు పేరు భైరవకోన :** వెంకటేశ్వర, కామేశ్వరి, కన్య-2 (గాజువాక)

● **హనుమాన్ :** లీలామహల్, నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 24, టమాటా 17, వంకాయలు (తెలుపు) 2, వంకాయలు (నలుపు) 30, బెండకాయలు 268, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 40, బీరకాయలు 38, ఆనపకాయలు 12, కాలీఫ్లవర్ 24, క్యాబేజ్ 24, క్యారెట్ 24, దొండకాయలు 24, బంగాళా దుంపలు 18, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 42, అల్లం (పాతది) 115, బరబటి 16, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 110, గోరుచిక్కుడు 02, దోస కాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 150, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 50, ఆగాకర 52, పొటల్స్ 62, కీరదోస 28, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 54, చిలగడదుంపలు 26 , కంద 60, దేముడు చిక్కుడు 56, కొండఉసిరి 65, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 55, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	475
విజయనగరం	479
శ్రీకాకుళం	479

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	105
ఫారం ధర	--	125
విత్ స్కిన్	--	220
స్కిన్‌లెస్	--	230

మరికొన్ని సిటీ వార్తలు | పేజీ Iలో..


అప్పికొండ సాగరతీరంలో సముద్ర స్నానానికి విచ్చేసిన భక్తులు


87వ వార్డు శ్రీగణేశ్‌నగర్‌లోని వినాయక ఆలయంలో శివునికి అభిషేకం చేస్తున్న అర్చకులు


పెదమడకలోని ఉమామహేశ్వర ఆలయ ఆవరణలో చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన

అప్పికొండ ఆలయానికి పోటెత్తిన భక్తులు

మహా శివరాత్రి జాగరణ అనంతరం సముద్ర స్నానాలు ఆచరించిన జనం

హుండీలు, టికెట్ల విక్రయాల ద్వారా రూ.10,15746 ఆదాయం

లింగోద్భవ సమయంలో శివనామ స్మరణతో మార్మోగిన పలు ప్రాంతాల్లోని ఆలయాలు

గాజువాక/ఉక్కుటౌన్‌షిప్, మార్చి 9: అప్పికొండలోని పురాతన శివాలయంలో మహా శివరాత్రి పూజలు శుక్రవారం రాత్రి అత్యంత వైభవంగా జరిగాయి. వేలాది మంది భక్తులు విచ్చేసి స్వామి వారిని దర్శించుకుని జాగరణ చేశారు. శుక్రవారం రాత్రి జాగరణ చేసిన భక్తులంతా శనివారం వేకువజామున ఇక్కడి సముద్ర స్నానాలు ఆచరించారు. తీరంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా డీసీపీ ఎం.సత్తిబాబు, సౌత్ ఏసీపీ టి.త్రినాథ్ ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సముద్రం లోపలకు ఎవరూ వెళ్లకుండా లోపల కర్రలు పెట్టి తాడులు కట్టారు. అదేవిధంగా గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచారు. బీచ్ పెట్రల్ వాహనంతో పోలీసులు ప్రత్యేక గస్తీ చేపట్టారు. మహిళలు దుస్తులు మార్చుకునేందుకు వీలుగా తాత్కాలికంగా షెడ్లు ఏర్పాట్లు చేశారు. సముద్ర స్నానాలకు విచ్చేసిన భక్తులకు ప్రముఖ వక్త మోడేకూర్తి సత్యనారాయణ, పోలీసులు మైక్‌లో పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. అధికారులు ముందస్తు చర్యల్లో భాగంగా ఏడు గుడుల ప్రాంతంలోనే ఆటోలు, ద్విచక్ర వాహనాలను నిలిపివేయడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తలేదు. అధికారులంతా సమన్వయంతో పని చేయడంతో మహా శివరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా ముగిశాయి.

సమకూరిన ఆదాయం రూ.10,15746

మహా శివరాత్రి సందర్భంగా అప్పికొండ శివాలయానికి రూ.10,15746 ఆదాయం సమకూరింది. టికెట్ల విక్రయం ద్వారా రూ.4,02,180, ప్రసాదం అమ్మకాల ద్వారా రూ.2,77,980, హుండీల ద్వారా రూ.3,15,586, కొబ్బరికాయల పాట ద్వారా రూ.ఇరవై వేలు కలిపి మొత్తం రూ.10,15746 ఆదాయం లభించింది. కాగా గత సంవత్సరం శివాలయానికి రూ.9,58,803 ఆదాయం రాగా ఈ ఏడాది రూ.56,943 ఆదాయం అధికంగా వచ్చింది.


మాతృశ్రీనగర్ శివాలయంలో పూజలందుకున్న త్రినేత్రుడు.. పక్కన శివపార్వతుల కల్యాణంలో పాల్గొన్న భక్తులు

కూర్మన్నపాలెం: మహా శివరాత్రి సందర్భంగా శుక్రవారం అర్ధరాత్రి లింగోద్భవ సమయంలో శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తుల జాగరణ కోసం ఆలయ కమిటీలు ప్రత్యేక చర్యలు చేపట్టాయి. ప్రత్యేక హోమాలు, విశేష పూజలు, కల్యాణాలు జరపడంతో పాటు నాటికలు, జానపద నృత్యాలు వంటి సాంస్కృతిక ప్రదర్శనలను ఏర్పాటు చేశాయి. ఇందులో భాగంగా 86వ వార్డు మాతృశ్రీనగర్‌లోని శివాలయంలో ఆలయ ధర్మకర్త దామా సుబ్బారావు, దమయంతి ఆధ్వర్యంలో అర్చకులు మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, జ్యోతి దర్శనం, పాశుపత హోమం, సామూహిక రుద్రాభిషేకాలు జరిపారు. అనంతరం శివపార్వతుల కల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. అలాగే 87వ వార్డు శ్రీగణేశ్‌నగర్ వరసిద్ధి వినాయక ఆలయంలో ప్రత్యేక ఏర్పాటు చేసిన శివలింగం వద్ద రుద్రాభిషేకాలు, ప్రత్యేక హోమాలు, పూజలు చేయడంతో పాటో కోలాటం ప్రదర్శనను నిర్వహించారు. కూర్మన్నపాలెం సంపత్ వినాయక ఆలయంలో మహా శివలింగార్చన సహిత మహా పాశుపత రుద్ర హోమాన్ని జరిపారు. 70వ వార్డు పరిధి చట్టివానిపాలెం, ఆటోనగర్ శివాలయాల్లో లింగోద్భవ సమయంలో త్రినేత్రునికి మహా రుద్రాభిషేకం చేశారు. ఆయా పూజాది కార్యక్రమాల్లో వందలాది భక్తులు పాల్గొన్నారు.


అప్పికొండలో హుండీలలోని నగదును లెక్కిస్తున్న దృశ్యం.. పక్కన శారదాపీఠంలో దక్షిణామూర్తిని అభిషేకిస్తున్న పీఠాధిపతులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పరిధి పెదమడక శ్రీఉమామహేశ్వర ఆలయానికి జాగరణ చేసిన భక్తులు శనివారం వేకువజామున అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మధ్యాహ్నం అన్న సమారాధన చేపట్టారు. శివరాత్రి వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఆలయ కమిటీ ప్రతినిధులు డి.అప్పలనాయుడు, కె.పైడిరాజు, జి.సత్యనారాయణ, గజేంద్రరరావు, తదితరులు పాల్గొన్నారు. బీసీ కాలనీలోని బ్రహ్మకుమారీస్ సంస్థ ఏర్పాటు చేసిన ద్వాదశ జ్యోతిర్లింగాలను పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. సంస్థ ప్రతినిధులు బీకే వేణి, సోమేశ్వరి, రామకోటి, తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి: చినముషిడివాడలోని శారదా పీఠంలో పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి పర్యవేక్షణలో మహా శివరాత్రి పూజలు చేశారు. పీఠం ప్రాంగణంలోని మేథో దక్షిణామూర్తికి విగ్రహానికి పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. పదకొండు రకాల సుగంధద్రవ్యాలతో దక్షిణామూర్తిని అభిషేకించారు. లింగోద్భవ సమయం నుంచి మూడు గంటలు పాటు ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. పీఠం అధిష్ఠానదేవత శారదా స్వరూప రాజశ్యామల సన్నిధిలో జ్యోతిర్లింగార్చన, చంద్రమౌళీశ్వరులకు పంచామృతాభిషేకాలు జరిపారు. అలాగే తాండవమూర్తి సన్నిధిలో రుద్రహోమం, మృత్యుంజయ హోమం, బ్రహ్మ ముహూర్త కాలంలో హోమాలకు పూర్ణాహుతి చేశారు. కాగా పుణ్యగిరి క్షేత్రంలో జాగరణ, స్నానమాచరించిన వందలాది భక్తులకు పెందుర్తికి చెం దిన సీడ్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు వెన్న నాగరాజు ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేపట్టారు.

ఎన్.ఎ.డి.జంక్షన్: ఎన్‌ఏడీలోని కాశీవిశ్వేశ్వరాలయంలో శుక్రవారం అర్ధరాత్రి అభిషేకాలు, రుద్రాభిషేకం, తదితర పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. సుసుర్ల కాలనీలోని చంద్రమౌళీశ్వరాలయం, కాకానీనగర్ శివాలయం, లక్ష్మీనగర్ ఎఫ్-బ్లాక్‌లోని ఉమాగణపతి ఆలయంలో లింగోద్భవ సమయంలో జరిపిన పూజలు, అభిషేకాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రజల బాగు కోసం టీడీపీని గెలిపించాలి

పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు

ఆర్పీపేట (కంచరపాలెం), మార్చి 9: పేద, మధ్యతరగతి ప్రజల జీవితాల్లో వెలుగులు నిండాలంటే రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని తెలిపించాలని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు కోరారు. 57వ వార్డు పరిధి గౌరీనగర్, సుభాష్‌నగర్, తదితర ప్రాంతాల్లో శనివారం గణబాబు ఎన్నికల ప్రచారం చేశారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. టీడీపీ-జనసేన రూపొందించిన బీసీ డిక్లరేషన్ వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపుతుందన్నారు. అధోగతిపాలైన రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు అనుభవజ్ఞులైన చంద్రబాబును మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు అందరూ కృషి చేయాలని కోరారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఎస్.రాజశేఖర్, టీడీపీ వార్డు అధ్యక్షుడు పెంటకోట అజయ్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.


57వ వార్డులో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే గణబాబు

శ్రమించే వారికి టీడీపీలో గుర్తింపు

కూర్మన్నపాలెం: కార్యకర్తల పార్టీ టీడీపీ అని, శ్రమించిన వారికి పార్టీలో గుర్తింపు ఉంటుందని రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ అన్నారు. 87వ వార్డులోని పార్టీ కార్యాలయంలో శనివారం రాత్రి ఎన్నికల శంఖారావం కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టి నుంచి మద్యం వరకు అవినీతికి పాల్పడిన వైసీపీని తరిమికొట్టేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. సూపర్ సిక్స్ పథకాల గురించి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎస్ఎస్ విజయరామరాజు, వి.రాంబాబు, రాజన్ రాజు, శ్రీనివాసవర్మ, పి.దానయ్య సూర్యప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.


సూపర్ సిక్స్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గంధం శ్రీనివాసరావు, తదితరులు

'సూపర్ సిక్స్'ను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

పెదగంట్యాడ: టీడీపీ మేనిఫెస్టోలో పేర్కొన్న సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని జీవీఎంసీ 'దేశం' డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు కోరారు. టీడీపీ 76వ వార్డు కార్యాలయంలో జరిగిన వార్డు అధ్యక్ష, కార్యదర్శులు, బూత్ కన్వీనర్లు, ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో టీడీపీ విజయం కోసం అందరూ అవిశ్రాంతంగా పనిచేయాలన్నారు. తొలుత బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ, సూపర్ సిక్స్ పథకాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో నాయకులు తాటికొండ సుదర్శనరావు, పి.ఉగ్రం, కె.వెంకటరావు, బి.సత్యారావు, పి.ఉమ, సోములు, రోహిత్, దాడి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.


బూత్ కమిటీ సభ్యుల సమావేశంలో మాట్లాడుతున్న ఆడారి ఆనంద్‌కుమార్

వైసీపీ హయాంలో ప్రజలకు మేలు

పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్

మల్కాపురం, మార్చి 9: వైసీపీ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరుతుందని పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. కొత్తనక్కవానిపాలెంలోని పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ సర్కారు చేపట్టిన ప్రజా సంక్షేమ కార్యక్రమాలే పార్టీని గెలిపిస్తాయన్నారు. పశ్చిమ సమన్వయకర్తగా తాను బాధ్యతలు చేపట్టాక ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టినట్టు పేర్కొన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్, నియోజకవర్గ అధ్యక్షుడు పుర్రె సురేశ్, నాయకులు నర్సింగ్ యాదవ్, రేవల సత్యనారాయణ, అంగ రాంప్రసాద్, బోగవిల్లి గురునాథరావు, తదితరులు పాల్గొన్నారు. అలాగే 58, 59, 60 వార్డుల బూత్ కమిటీ సభ్యులతో రాత్రి నిర్వహించిన సమావేశంలో ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం చేసిన మంచిని, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి ఓట్లును అభ్యర్థించాలన్నారు. ఎన్నికలు సమీపిస్తున్నం దున వైసీపీ గెలుపే ధ్యేయంగా ముందుకు సాగాలన్నారు. 60వ వార్డు కార్పొరేటర్ పీవీ సురేశ్, నాయకులు పిల్లా కనకరాజు, దాట్ల శ్రీనివాసరాజు, తదితరలుఉ పాల్గొన్నారు.

అద్దెకు వీఎంఆర్‌డీఏ ఫంక్షన్ హాల్

విశాఖపట్నం, మార్చి 9: పెందుర్తి మండలం చినముషిడివాడ వుడా లేవుట్‌లోని జోగులాంబ బస్ స్టాప్ వద్ద వీఎంఆర్ డీఏ ఆధ్వర్యంలో కొత్తగా కల్యాణ మండపం నిర్మించినట్టు వీఎంఆర్‌డీఏ కార్యదర్శి కీర్తి తెలిపారు. శనివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. కల్యాణ మండపంలో ఒకేసారి రెండు ఫంక్షన్‌లు చేసుకునేలా గ్రౌండ్, ఫస్ట్ ఫ్లోర్‌లో ప్రత్యేక సౌకర్యాలతో నిర్మించామన్నారు. సోమవారం నుంచి అందుబాటులోకి వస్తుందని, ఫంక్షన్‌లు చేసుకునే వారికి అద్దె ప్రాతిపదికన అందిస్తామని చెప్పారు. వివరాలకు 9246165557, 9700354772 ఫోన్ నంబర్లను సంప్రతించాలని సూచించారు.

ఘనంగా షిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

పెందుర్తి, మార్చి 9: మండలంలోని ఎస్ఆర్‌పురంలో ఉన్న షిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయినాథునికి క్షీరాభిషేకం చేశాక నూతన వస్త్రాలు, పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే, జనసేన పార్టీ విశాఖ, అనకాపల్లి జిల్లాల అధ్యక్షుడు పంచకర్ల రమేశ్‌బాబుతో పరిసర ప్రాంతాల ప్రజలు అధిక సంఖ్యలో సాయిబాబాను దర్శించుకున్నారు. సర్పంచ్ దూది రమణ, గొరపల్లి సోమునాయుడు, తదితరులు పాల్గొన్నారు.


కొత్తపాలెం ప్రధాన రహదారిలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

కొత్తపాలెంలో కేంద్ర బలగాల కవాతు

గోపాలపట్నం, మార్చి 9: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కేంద్ర సాయుధ బలగాలు శనివారం గోపాలపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో కవాతు నిర్వహించాయి. ఎన్నికల సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూసేందుకు కేంద్ర రిజర్వ్ బలగాలు ఇటీవల నగరానికి చేరుకున్నాయి. ఎన్నికల వేళ ఓటు హక్కు వినియోగించుకునే వారికి ఎటువంటి ఇబ్బందులు ఉండవని వారిలో భరోసా నింపడానికి కవాతు నిర్వహించాలని నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ అయ్యన్నార్ ఆదేశాలతో గోపాలపట్నం స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కొత్తపాలెంలోని నాగేంద్రకాలనీ కూడలి నుంచి కొత్తపాలెం గ్రామం ప్రధాన రహదారిలో గల పోలింగ్ బూత్‌ల వరకు సాయుధ బలగాలు కవాతు నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అప్పలనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

వెంకన్న బ్రహ్మోత్సవాలకు శారదా పీఠాధిపతికి ఆహ్వానం

వేపగుంట మార్చి 9: ఇక్కడి నాయుడుతోట రవినగర్ శేషాద్రి కొండపై ఉన్న కల్యాణ వేంకటేశ్వరాలయ 24వ వార్షిక బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలంటూ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతికి ఆలయ ఈవో బండారు ప్రసాద్, అర్చకులు శ్రీనివాసస్వామి ఆహ్వాన పత్రికను శనివారం అందజేశారు. ఈ నెల 12 నుంచి 17వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయని, ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రావాలని కోరుతూ శారదా పీఠాధిపతిని ఆహ్వానించారు. అంతకుముందు కల్యాణ వెంకన్న ఆలయంలో జరుగుతున్న పూజలు, అభివృద్ధి గురించి పీఠాధిపతికి ఈవో వివరించారు.

రహదారి పనులు పరిశీలన

వేపగుంట, మార్చి 9: జీవీఎంసీ 93వ వార్డు పరిధి శ్రీనివాసనగర్ శివారు కాలనీలో భూ తగదాల కారణంగా రహదారి నిర్మాణ పనులు నిలిచిపోయాయంటూ పలువురు కార్పొరేటర్ రాపర్తి కన్నా దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన ఇరువర్గాలతో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. దీంతో గత 20 ఏళ్లుగా పూర్తికాని సీసీ రోడ్డు నిర్మాణ పనులను శనివారం ఆయన పరిశీలించారు. త్వరలో ఈ రోడ్డు అందుబాటులోకి రానుండడంతో కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేశారు. స్థానిక నాయకులు కర్రి పైడిరాజు, బి.కనకరాజు, గణేశ్, బి.సూరిబాబు. మహేశ్, తదితరులు పాల్గొన్నారు.


దీక్షా శిబిరంలో పోరాట కమిటీ నాయకులు, కార్మికులు

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు రాజీ లేని పోరాటాలు

ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ

కూర్మన్నపాలెం, మార్చి 9: స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం రాజీ లేని పోరాటాలు చేస్తామని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపా లెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 1,022 రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతుండడం దారుణమన్నారు. రూ.లక్షల కోట్లు విలువ చేసే స్టీల్‌ప్లాంట్‌ను అతి తక్కువ ధరకు కొన్ని కార్పొరేట్ కంపెనీలకు అప్పగించేందుకు కేంద్రం కుట్ర పన్నుతుందన్నారు. ప్రభుత్వ రంగాలను కాపాడుకోవలసిన బాధ్యత అన్ని వర్గాల ప్రజలపై ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు నమ్మి సింహాద్రి, పి.సోమునాయుడు, నరేంద్ర, ప్రసన్న కుమార్, శంకర్, శ్రీనివాస్, జయ, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రాసాలమ్మ పండుగ

కూర్మన్నపాలెం, మార్చి 9: జీవీఎంసీ 86వ వార్డు పరిధి రాసాలమ్మ కాలనీలో శనివారం రాసాలమ్మ పండుగను వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు కె.నరసింహశాస్త్రి అమ్మవారికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక అలంకరణ చేశారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. సాయంత్రం అమ్మవారి ఊరేగింపులో ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ, గ్రామ కమిటీ ప్రతినిధులు ఒమ్మి అప్పలనాయుడు, జి.సింహాచలంనాయుడు, ఎం.వెంకటసుబ్బయ్య, మురళీమోహన్, టీవీ నాయుడు, రవి, బి.రమణ, గణపతి తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో హోమియో వైద్య శిబిరం

అగనంపూడి, మార్చి 9: జీవీఎంసీ 85వ వార్డు పరిధి పెదమడకలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ఏరియా ఆస్పత్రిలోని ఆయూష్ విభాగం సౌజన్యంతో శనివారం ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. హోమియోపతి వైద్యాధికారి డాక్టర్ కళావతి ముఖ్యఅతిథిగా హాజరై ఈ శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ హోమియో వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం పలువురికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు గుడే సుశీల గజేంద్రరావు, కె.హనుమంతురావు, జోగినాయుడు, మస్తాన్‌రెడ్డి, జగదీశ్, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాల వద్ద పోలీసుల గస్తీ



ఎజీజీఓస్ పాఠశాల వద్ద కానిస్టేబుల్ బందోబస్తు

అక్కయ్యపాలెం, మార్చి 9: గ్రేటర్ 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలకు ఆకతాయిల బెడద ఎక్కువగా ఉండడంతో శనివారం పోలీసులు గస్తీ నిర్వహించారు. ఈ మేరకు ఒక కానిస్టేబుల్ ఉదయం, సాయంత్రం పాఠశాలకు వచ్చి పరిసర ప్రాంతాలను పరిశీలించారు.అలాగే, ఆకతాయిలు ఏ సమయంలో పాఠశాలకు వస్తున్నారో ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలకు వచ్చిన పోలీసులను గమనించిన ఆకతాయిలు పరిసర ప్రాంతాల్లో కానరా లేదు.

ఏకలవ్య కాలనీలో వయోజన విద్యాకేంద్రం ప్రారంభం



మాట్లాడుతున్న నివాసితుల సంఘ ప్రతినిధి లక్ష్మి

మాధవధార, మార్చి 9 ;మురికివాడల నివాసితుల సంక్షేమ సంఘం, ప్రగతిశీల మహిళా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో శనివారం మాధవధార ఏకలవ్యకాలనీలో సావిత్రి భాయి పూలే వయోజన విద్యాకేంద్రాన్ని ప్రారంభించారు. మురికివాడల నివాసితుల సంక్షేమ సంఘం ప్రతినిధి పి.లక్ష్మి మాట్లాడుతూ, భూ కబ్జాదారులు, అధికారుల నిర్లక్ష్య వైఖరికి వ్యతిరేకంగా పోరాడుతున్న కాలనీవాసులు అభినందనీయులన్నారు. 40 ఏళ్లుగా వీరికి ఇదే చోట సొంతిళ్లు కట్టి ఇవ్వాలని చేస్తున్న పోరాటం త్వరలోనే నెరవేరుతుందన్నారు. స్థానికులను చైతన్యవంతుల్ని చేసేదిశగావిద్యా కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సావిత్రిభాయి పూలే ట్రస్ట్ చైర్‌పర్సన్ జి.సీతామహాలక్ష్మి, లీడర్ పత్రిక సంపాదకుడు రమణమూర్తి, ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి నారాయణ వేణు, చైతన్య మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షులు లలిత, విద్యా పరిరక్షణ కమిటీ కిశోర్, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ ప్రతినిధి వై.కొండయ్య, రోహిణి, ముత్యాలు, నాగమణి పాల్గొన్నారు.

యమపాశాల్లా కేబుల్ తీగెలు

» మురళీనగర్ పరిధిలో రోడ్లకు అడ్డంగా ఫైబర్ కనెక్షన్, విద్యుత్ తీగలు

మురళీనగర్, మార్చి 9: ప్రధాన రహదారుల నుంచి కాలనీలకు వెళ్లే రోడ్లపై గుట్టలుగా వేలాడుతున్న వివిధ తీగెలు ప్రయాణికుల పాలిట యమపాశాల్లా మారాయి. ఓవైపు కేబుల్ వైర్లు కనపించకుండా జీవీఎంసీ స్మార్ట్ సిటీ పేరిట చేపడుతున్న పనులు క్షేత్రస్థాయిలో ఫలితాలనివ్వడం లేదు. విద్యుత్, యూజీడీ పైపులు... టెలికం ఫైబర్ కేబుల్స్ భూగర్భం నుంచే అమర్చి రహదారులను సుందరంగా మార్చుతామని రాజకీయ నాయకులు, అధికారులు చేస్తున్న ప్రకటనలకు కాలనీల్లోని పరిస్థితికి పొంతన కుదరటం లేదు. విశాఖ ఉత్తర నియోజకవర్గంలో మురళీనగర్, మాధవధార ఉడాకాలనీలతో సహా ప్రభుత్వ కార్యాలయాలు అధికంగా ఉండే మర్రిపాలెం, మురళీనగర్ ప్రాంతాల్లో కేబుల్ తీగలు ఎక్కడికక్కడ వేలాడుతూ దర్శనమిస్తున్నాయి. ఇవి నిత్యం రాకపోకలు సాగించే వారికి ప్రమాద భరితంగా మారాయి. కేబుల్ తీగెలు స్తంభాలనుంచి రహదారుల వరకు వస్తున్నాయి. కొన్ని చోట్ల అడ్డంగా ఉంటున్నాయి. 48ఏ బస్సు రూట్‌లో ఇటీవల రోడ్డుపై వేలాడిన తీగెలను ప్రయాణికులు వాహనాలు నిలిపి సరిచేసుకున్నారు. కళింగనగర్‌లో ఎస్‌బీఐ బ్యాంకు, ఏటీఎం కేంద్రాల వద్ద నిత్యం తీగెలు కాళ్లకు చిక్కుకుని పడిపోతున్నారు. వాహనదారులు ప్రమాదాలు చవిచూస్తున్నారు.



స్తంభానికి చుట్టుకుని...



ఉడాకాలనీలో బైక్ రైడర్స్‌కు ప్రమాదకరంగా..



కళింగనగర్‌లో రోడ్డుకు అడ్డంగా కేబుల్ వైర్లు

ఆర్‌జేడీ విజయభాస్కర్‌ను కలిసిన ఆపస్ నాయకులు



ఆర్‌జేడీకి పూలమొక్క అందిస్తున్న నాయకులు

అక్కయ్యపాలెం, మార్చి 9: పాఠశాల విద్యాశాఖ విశాఖపట్నం రీజనల్ జాయింట్ డైరెక్టర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన విజయభాస్కర్‌ను ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఏపీయూ ఎస్) నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పూల మొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనను కలిసిన వారిలో సంఘం జిల్లా అధ్యక్షుడు అరుణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి త్రినాధమూర్తి, కోశాధికారి, నగర ప్రధాన కార్యదర్శి ఎంఎస్‌వీ విశ్వనాథం, నారాయణరావు ఉన్నారు.

ఘనంగా దుర్గాలమ్మ జాతర

పూర్ణామార్కెట్, మార్చి 9: వన్‌టౌన్ పరిధిలో దుర్గాలమ్మ జాతర మహోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈసందర్భంగా పూర్ణామార్కెట్ ఏరియాలో స్థానిక యువకులు భక్తులకు ప్రసాద వితరణ చేశారు. వైసీపీ వార్డు అధ్యక్షుడు ఎ. కనకరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ఈ ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో వార్డు నాయకులు సుబ్రహ్మణ్యం, ఎం.వెంటక విజయ్, చిట్టిబోయిన విజయ్, పి.రమణమ్మ, పిల్లి చిన్ని, నాగేశ్ పాల్గొన్నారు.

పేదలకు అండగా ఉంటాం

» టీడీపీ 'దక్షిణ' ఇన్‌చార్జి గండి బాబ్జీ



మాట్లాడుతున్న గండి బాబ్జీ

విశాఖపట్నం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పేద వర్గాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని టీడీపీ దక్షిణ ఇన్‌చార్జి గండి బాబ్జీ అన్నారు. శనివారం వన్‌టౌన్‌లోని 39వ వార్డు కోటవీధి ఫెర్రీరోడ్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సుమారు 600మంది పేద ముస్లిం, హిందూ కుటుంబాలకు రంజాన్‌తోఫా కింద నిత్యావసరాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింలకు ఏటా టీడీపీ హయాంలో రంజాన్ తోఫా కింద నిత్యావసరాలు అందజేసినట్టు గుర్తుచేశారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో తిరిగి అధికారంలోనికి వచ్చిన తరువాత ముస్లింలకు పెద్దపీట వేస్తామన్నారు. కోటవీధికి చెందినలడ్డూబాయ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు, వార్డు అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, కార్యకర్తలున్నారు.

భాను స్ట్రీట్‌లో ఆక్రమణలతో అవస్థలు



సాయంత్రంవేళ రోడ్డుపక్కన ఫుడ్ పాయింట్లు, వాహనాలు

డాబాగార్డెన్స్, మార్చి 9: జీవీఎంసీ 31వ వార్డు పరిధి భానుస్ట్రీట్ సాయంత్రం వేళలో రద్దీగా మారిపోతోంది. రోడ్డు పక్కన పలువురు వ్యాపారుల ఫుడ్ పాయింట్స్ ఆక్రమణలతో నిండిపోతోంది. సాయంత్రం 4 నుంచి రాత్రి వరకు ఇక్కడి రహదారిపై ఫుడ్‌పాయింట్స్‌లో విక్రయాలు చేపడుతుండంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. దుకాణాల ఎదుట కొనుగోలుదారులు, వారి వాహనాలతో స్థానికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏదైనా భారీ వాహనాలు వస్తే... ట్రాఫిక్ అంతరాయం తప్పడం లేదు. దీంతో పాటు రోడ్డుపైనే తిన్న కొన్ని పేపర్ ప్లేట్లు సైతం ఎగిరిపోతున్నాయి. సంబంధిత అధికారులు కనీసం పట్టించుకోకపోవడంపై విమర్శలు తలెత్తుతున్నాయి. ఇకనైనా ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని ఈ సందర్భంగా పలువురు స్థానికులు కోరుతున్నారు.

హోల్‌సేల్ మార్కెట్‌లో పబ్లిక్ టాయిలెట్స్ ప్రారంభం

జ్ఞానాపురం, మార్చి 9: కాన్వెంట్ కూడలిలోని హోల్‌సేల్ మార్కెట్‌లో ఉన్న సమస్యలపై ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. శనివారం మార్కెట్‌లో ఉన్న పబ్లిక్ టాయిలెట్‌లను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ ప్రారంభించారు.

కలిసికట్టుగా...

... 5వ పేజీ తరువాయి

విజయకుమార్, పెందుర్తి పంచకర్ల రమేశ్‌బాబు పేర్లు ఖరారయ్యాయి. విశాఖ జిల్లాకు వచ్చేసరికి దక్షిణం సీటు జనసేనకు ఇచ్చారు. అక్కడి నుంచి ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ పోటీ చేస్తారని ప్రచారం జరుగుతోంది. ఇప్పుడు బీజేపీ కూడా కొన్ని అసెంబ్లీ స్థానాలు కోరుతోంది. గతంలో 2014లో టీడీపీ, బీజేపీ కలిసి పోటీ చేసినప్పుడు విశాఖ ఉత్తర నియోజకవర్గం నుంచి విష్ణుకుమార్‌రాజు ఎమ్మెల్యేగా గెలుపొందారు. గత 2019 ఎన్నికల్లో ఆయన పోటీ చేసి ఓడిపోయారు. ఇప్పుడు మళ్లీ పోటీ చేయడానికి ప్రచారం కూడా ప్రారంభించారు. ఉమ్మడి విశాఖలో బీజేపీకి ఏమైనా అసెంబ్లీ స్థానాలు ఇచ్చినట్టయితే అందులో మొదటిది విశాఖ ఉత్తర నియోజకవర్గమే అవుతుందని ఆ పార్టీ నాయకులు అంటున్నారు. బీజేపీలో రాష్ట్ర కోశాధికారి ఎం.నాగేంద్ర, నగర పార్టీ అధ్యక్షులు మేడపాటి రవీంద్ర, అధికార ప్రతినిధి సుహాసినీ ఆనంద్, బీజేపీ యువమోర్చా నాయకుడు సురేంద్రమోహన్ వంటివారు ఈసారి ఎన్నికల్లో పోటీ చేయాలని భావిస్తున్నారు. ఇంకా ఏమైనా అదనంగా అసెంబ్లీ స్థానాలు కేటాయిస్తే వారిలో ఎవరికైనా ఛాన్స్ దక్కవచ్చు.

ఓటర్లకు తాయిలాలు!

... 5వ పేజీ తరువాయి

వ్యూహాలు రచిస్తున్నారు. ఇందుకోసం ఎంత ఖర్చయినా భరించేందుకు కూడా సిద్ధమవుతున్నారు.

వైసీపీ కానుకల పంపిణీ

నగరంలోని పలువురు వైసీపీ నాయకులు కానుకల పేరుతో మహిళలకు చీరలను పంపిణీ చేస్తున్నారు. కొద్దిరోజుల కిందట ఇంటింటికీ స్వీట్ బాక్సులను అందించారు. ఓ కీలక నేత ఓటర్లకు దుస్తులు పంపిణీ చేయడంతో పాటు మహిళలకు చీరలు, ఇతర ఖర్చులకు రూ.500 చొప్పున పంపిణీ చేశారు. ప్రలోభాలకు ఓటర్లు లొంగిపోతే రానున్న రోజుల్లో ఈ నాయకులు మరింత రెచ్చిపోతారనే వాదన వినిపిస్తోంది.

అవసరాలు తెలుసుకుని..

వచ్చే ఎన్నికల్లో విజయం కోసం ప్రయత్నిస్తున్న కీలక నేతలు..వ్యక్తిగతంగా ప్రతి ఓటరును కలుస్తూనే..గంప గుత్తగా పడే ఓట్లపై దృష్టి సారించారు. ఇందుకు కుల, వృత్తి సంఘాలు, అసోసియేషన్లను ఎంచుకుంటున్నారు. ఆయా సంఘాల ముఖ్య నాయకులతో సమావేశమై వారి అవసరాలను తీరుస్తామని, ఎన్నికల్లో సహకరించాలని కోరుతున్నారు. ఇందుకోసం ఒక్కో నేతకు క్షేత్రస్థాయిలో రెండు, మూడు బృందాలు పనిచేస్తున్నాయి. వీరంతా నియోజకవర్గ పరిధిలోని కీలక సంఘాలు, అసోసియేషన్ల ప్రతినిధులతో సమావేశం కావడం, వారి అవసరాలను తెలుసుకుని పోటీలో ఉన్న నేతకు తెలియజేస్తున్నారు. ప్రస్తుతం నగర పరిధిలోని మూడు నియోజకవర్గాలకు చెందిన అధికార పార్టీ నేతలు ఇదే పనిలో ఉన్నట్టు సమాచారం. ఖర్చుకు వెనుకాడని ఈ నాయకులు యువతపైనా దృష్టిసారిస్తున్నారు. క్రికెట్ కిట్లు, వాలీబాల్, బ్యాడ్మింటన్, టెన్నిస్ కిట్లతో వారిని ప్రలోభపెట్టి తమ వైపు తిప్పుకునేందుకు ఆపసోపాలు పడుతున్నారు.

తాయిలాలకు లొంగిపోతే...అంతే!

ఎన్నికల సమయంలో నేతలు పంచే డబ్బు, ఇతర ప్రలోభాలకు లొంగిపోతే ఐదేళ్లపాటు జీవితం అస్తవ్యస్తమవుతుందనే విషయాన్ని ఓటర్లంతా గుర్తుంచుకోవాలని మేధావులు సూచిస్తున్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండే నేతలను ఎన్నుకుంటే మేలు జరుగుతుందని, పిల్లల భవిష్యత్తు మెరుగుపడుతుందని చెబుతున్నారు. ప్రస్తుత పాలకుల హయాంలో కనీస అవసరాలైన నీరు, రోడ్లు, విద్యుత్ తదితర సమస్యల పరిష్కారానికి కృషి జరుగుతోందా?, అభివృద్ధి పనులు చేపడుతున్నారా?...వంటి విషయాలను పరిగణనలోకి తీసుకుని ఓటు వేయాలంటున్నారు. ప్రలోభాలకు, తాయిలాలకు లొంగిపోయి అసమర్థులను గెలిపిస్తే భవిష్యత్తు అంధకారం అవుతుందని ఆంధ్ర విశ్వవిద్యాలయం విశ్రాంత ప్రొఫెసర్ పరమేశ్వరరావు హెచ్చరిస్తున్నారు.

విద్యాశాఖలో దొడ్డిదారి బదిలీలు?

... 5వ పేజీ తరువాయి

కమిషనరేట్ అధికారులు తెప్పించుకున్నారు. ఎన్నికల ముందు బదిలీ ఉత్తర్వులు తెచ్చుకోకపోతే తరువాత కష్టమని భావించిన టీచర్లు కొందరు పోస్టింగ్స్ కోసం రూ.లక్షలు ఇచ్చినట్టు తెలిసింది. గత ఏడాది సాధారణ బదిలీల్లో సుమారు 300 మంది ఉపాధ్యాయులు అల్లూరి సీతారామరాజు జిల్లాకు బదిలీ అయ్యారు. వీరిలో ఎక్కువ మంది మహిళలు ఉన్నారు. ఉద్యోగం వచ్చినప్పటి నుంచి పలు రకాల కారణాలతో విశాఖ, అనకాపల్లి పరిసరాల్లో పనిచేసిన టీచర్లు ఏజెన్సీకి బదిలీపై వెళ్లాల్సి వచ్చింది. ఎలాగైనా అక్కడ నుంచి తిరిగి మైదానం అది కూడా విశాఖ పరిసరాలకు వచ్చేయాలని...అప్పటి నుంచి పైరవీ చేస్తున్నారు. గత ఏడాది కొద్దిమంది ఏజెన్సీ నుంచి మైదానానికి వచ్చేశారు. ఇందుకు రెండు లక్షల నుంచి మూడు లక్షల రూపాయల వరకూ ఖర్చు చేశారు. ఇప్పుడు కూడా ఏజెన్సీలో ఉన్న పలువురు టీచర్లు నగరానికి వచ్చేందుకు తమకు తెలిసిన అధికార పార్టీ నేతల ద్వారా నగరంలోని ప్రజా ప్రతినిధి, ఆయన వ్యక్తిగత సహాయకుడికి చెప్పించుకున్నారని ప్రచారం సాగుతుంది. అయితే దొడ్డిదారి బదిలీలకు సంబంధించిన వివరాలను బయటకు చెప్పకుండా విద్యాశాఖ గోప్యత పాటిస్తోంది. కాగా ఎన్నికల ముందు దొడ్డిదారిలో బదిలీలకు ప్రభుత్వం నిర్ణయించడంపై ఉపాధ్యాయ సంఘాలు మండిపడుతున్నాయి. ఏళ్ల తరబడి శివారు ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు నగరంలో పనిచేసేందుకు అవకాశం ఇవ్వాలి తప్ప పలుకుబడి ఉన్నవారికి ప్రాధాన్యం ఇస్తే ఎలాగని ప్రశ్నిస్తున్నారు.

చినముషిడివాడలో భారీ చోరీ

... 5వ పేజీ తరువాయి

జరిగింది. ఇళ్ల తాళాలు పగులగొట్టి 13 తులాల బంగారం, 200 తులాల వెండి సామగ్రిని దొంగలు ఎత్తుకుపోయారు. వివరాలిలా ఉన్నాయి. అప్పన్నపాలేనికి చెందిన శ్రీధర్ హెచ్‌పీసీఎల్ కాంట్రాక్టర్. శుక్రవారం ఇంటికి తాళం వేసి పనిపై బయటకు వెళ్లారు. రాత్రి పది గంటలకు తిరిగి వచ్చారు. ఇంటి తాళం పగులగొట్టి ఉండడంతో లోపలకు వెళ్లి చూడగా బీరువాలో ఉంచిన మూడు తులాల బంగారం, వంద తులాల వెండి వస్తువులు కనిపించలేదు. అలాగే ఆ పక్కనే ఉంటున్న రాజారావు ఈ నెల ఆరున కుటుంబంతో సహా అన్నవరం వెళ్లారు. శుక్రవారం రాత్రి ఎనిమిది గంటలకు వచ్చేసరికి ఇంటి తలుపులు బద్దలగొట్టి ఉన్నాయి. బీరువాలో భద్రపరిచిన పది తులాల బంగారం, వంద తులాల వెండి సామగ్రి మాయమయ్యాయి. దీంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ఈ రెండు చోరీలు ఒకే తరహాలో జరగాయని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు కేసులు నమోదు చేసి వారు దర్యాప్తు చేస్తున్నారు. రెండు రోజుల వ్యవధిలోనే మూడిళ్లలో చోరీ జరగడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు.

'తెలుగుదేశంతోనే రాష్ట్రాభివృద్ధి'



ఆర్‌టీ క్లబ్ డౌన్ రోడ్డులో కరపత్రాల పంపిణీలో నేతలు

డాబాగార్డెన్స్, మార్చి 9: తెలుగుదేశం ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యపడుతుందని గ్రేటర్ 31 వ వార్డు టీడీపీ అధ్యక్షుడు సారిపల్లి మహేశ్ పేర్కొన్నారు. శనివారం వార్డులోని ఆర్టీ క్లబ్ డౌన్, లలితాకాలనీ, గొల్లలపాలెం ప్రాంతాల్లోని టీడీపీ అధినేత చం ద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన యువతకు నిరుద్యోగభృతి, ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15 వేలు, రైతుకు ఏటా ఆర్థిక సాయం, ప్రతి ఇంటికి మూడు గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచితబస్సు ప్రయాణం, నెలకు రూ.1, 500 పథకాలను ఇంటింటా వివరించారు. వార్డు క్లస్టర్ ఇన్‌చార్జి వానపల్లి గాయత్రిఫణికుమారి, భద్రమాని రమాదేవి, ఎండీ ఇలియాస్, గరికిన ఎల్లాజీ, అట్టాడ అప్పారావు, హేమలత, కె.శంకరరావు, పల్లా శ్రీను, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతమ్మధార: బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం కృషి చేసిన చంద్రబాబు నాయుడును మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని 24వ వార్డు టీడీపీ బూత్ ప్రెసిడెంట్, ఎస్సీ నాయకుడు వంగలపూడి నూకరాజు పిలుపునిచ్చారు. వార్డు టీడీపీ అధ్యక్షురాలు బర్ల పద్మలత ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ, సూపర్ సిక్స్ బ్రోచర్లను పంపిణీ చేశారు.

చాకలిపేట ప్రాంతంలో రహదారుల నిర్మాణం



పూర్తయిన సీసీ రోడ్డు

పూర్ణామార్కెట్, మార్చి 9: వన్‌టౌన్ 30వ వార్డు మెయిన్ రోడ్డు ఆంజనేయస్వామి గుడి నుంచి కేజీహెచ్ ఓపీ గేటుకు వెళ్లే లింక్ రోడ్డు, చాకలిపేట రోడ్లను అభివృద్ధి చేశారు. ఇటీవల పత్రికల్లో కథనాల రావడంతో జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు, వార్డు కార్పొరేటర్ కోడూరు అప్పలరత్నం స్పందించారు. పూర్తిగా గతుకుల మయంగామారిన రహదారులను మరమ్మతులు చేపట్టారు.

సమష్టిగా వాకర్స్‌క్లబ్ అభివృద్ధి



మాట్లాడుతున్న ప్రెసిడెంట్ పల్లా.చంద్రమౌళి

మురళీనగర్, మార్చి 9; మురళీనగర్ వాకర్స్‌క్లబ్ సమష్టి కృషితో సమగ్ర పురోగతి సాధిస్తుందని క్లబ్ ప్రెసిడెంట్ పల్లా.చంద్రమౌళి పేర్కొన్నారు. శనివారం క్లబ్ నెలవారీ నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం కొత్త సభ్యులతో ప్రమాణ స్వీకారం చేపట్టారు. దామోదరం సంజీవయ్య న్యాయ విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసరు పి.వరలక్ష్మి ముఖ్యఅతిథిగా హాజరై క్లబ్ సేవలను కొనియాడారు. క్లబ్ కార్యదర్శి పి.చెల్వరాజు, వాకర్స్ క్లబ్ ఇంటర్నేషనల్ అడిషనల్ సెక్రటరీ ఆర్.సత్యనాధం, పూర్వ అధ్యక్షులు ఎన్.బుచ్చయ్య, కె.ద్వారకానాథ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సదస్సుకు 'నరవ'కు ఆహ్వానం



నరవ ప్రకాశరావు

డాబాగార్డెన్స్, మార్చి 9: బెంగళూరు నగరం కేంద్రంగా పనిచేస్తున్న ఇండియన్ సోషల్ ఇనిస్టిట్యూట్ జాతీయ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి 16 వరకు జరగనున్న 'వలస కార్మికుల సమస్య-వీటి నివారణకు సూచనలు' అంశంపై జాతీయ సదస్సుకు నగరానికి చెందిన నరవ ప్రకాశరావుకు ఆహ్వానం అందించింది. బాల వికాస్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక కార్యదర్శిగా ఆయన ఈ సదస్సులో వ్యాసం సమర్పించనున్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

జ్ఞానాపురం, మార్చి 9: జీవీఎంసీ 41వ వార్డు పరిధిలోని బాబూకాలనీ, జెఎన్ఎన్ఎంఆర్‌యూ కాలనీలలో రూ. 33లక్షలతో రిటైనింగ్ వాల్, సీసీ రోడ్ల నిర్మాణ పనులకు కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ మెంబరు కోడిగుడ్ల పూర్ణిమ, క్లస్టర్ ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్ శనివారం శంకుస్థాపన చేశారు. జ్ఞానాపురంఎర్రిగెడ్డలో చెత్తను ఎప్పటికప్పుడు ట్రక్కుల్లో లోడుచేసేందుకు వీలుగా రూ. 1.89 కోట్లతో ఏ ర్పాటు చేసిన పవర్ ఆపరేటెడ్ మెకానికల్ ఎస్కవేటర్ స్క్రీన్‌లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ ఏఈ సతీశ్‌నాయకులు వెలంగిణిరావు, అన్నపూర్ణ, దేవి, ఈశ్వరి, శ్యామ్‌సుందర్ పాల్గొన్నారు.

కంచరపాలెం: 48వ వార్డు పరిధి కొండవాలు ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఉత్తర వైసీపీ నాయకుడు కె.కె.రాజు శనివారం పరిశీలించారు. సీసీ రోడ్లు, కాలువలు, రిటర్నింగ్ వాల్స్ తదితర పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. కొండవాలు ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కమనీయం అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, మార్చి 9 : వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్య కల్యాణం శనివారం కమనీయంగా సాగింది. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ప్రత్యక్షంగా పాల్గొన్న భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం ఆగమశాస్త్ర విధానంలో కంకణధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణ, జీలకర్రా బెల్లం, మాంగళ్యధారణ జరిపి అక్షితారోపణం చేశారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు అందజేశారు.

జాతీయ స్థాయి జూడో పోటీలకు తగరపువలస విద్యార్థిని

తగరపువలస, మార్చి 9 : తగరపువలసకు చెందిన పాలెపు కీర్తి న్యూఢిల్లీలో ఈనెల 12 నుంచి 14 వరకు జరిగే జాతీయ స్థాయి జూడో (70 కిలోల విభాగం) పోటీలకు ఎంపికైంది. ప్రస్తుతం ఆమె భీమిలిలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. విద్యార్థిని ఢిల్లీ వెళ్లడానికి సన్ స్కూల్ అధినేత కె. శ్రీనివాసరావు రూ. 10 వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలకు చెందిన అరుణ్ కుమార్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అద్దెకు వీఎంఆర్‌డీఏ ఫంక్షన్ హాల్

సిరిపురం, మార్చి 9 : పెందుర్తి మండలం చినముషిడివాడ వుడా లేఅవుట్‌లోని జోగులాంబ బస్‌స్టాప్ వద్ద వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో కొత్తగా కల్యాణ మండపం నిర్మించినట్టు వీఎంఆర్‌డీఏ కార్యదర్శి కీర్తి తెలిపారు. శనివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు.కల్యాణ మండపంలో ఒకేసారి రెండు ఫంక్షన్‌లు చేసుకునేలా గ్రౌండ్, ఫస్ట్ ఫ్లోర్‌లో ప్రత్యేక సౌకర్యాలతో నిర్మించామన్నారు. సోమవారం నుంచి అందుబాటులోకి వస్తుందని, ఫంక్షన్‌లు చేసుకునే వారికి అద్దె ప్రాతిపదికన కేటాయిస్తామని చెప్పారు. వివరాలకు 92461 65557, 97003 54772 నంబర్లను సంప్రతించాలన్నారు.

జూపార్కులో విరిగిన బెంచీలు

ఆరిలోవ, మార్చి 9 : నగరంలోని జూపార్కులో లక్షలాది రూపాయలతో ఏర్పాటు చేసిన బెంచీలు అనతి కాలంలోనే విరిగిపోయాయి. జూకు వచ్చే పర్యాటకులు కూర్చేనేందుకు ఆరు నెలలు క్రితం వీటిని ఏర్పాటు చేశారు. అయితే బెంచీలు తయారీలో నాణ్యత లేకపోవడంతో కొద్దిరోజులకే విరిగిపోయాయి. దీంతో సందర్శకులు కూర్చోవడానికి బెంచీలు లేక ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి బెంచీల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



విరిగిపోయిన బెంచీ

కాలువల నిర్మాణానికి శంకుస్థాపన

ఆరిలోవ, మార్చి 9 : జీవీఎంసీ 11వ వార్డులో సుమారు రూ. 30 లక్షల జీవీఎంసీ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్లు, కాలువల నిర్మాణానికి మేయర్ గొలగాని హరి వెంకట కుమారి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు గొలగాని శ్రీనివాసరావు, ఏఈ వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ముకుందపురంలో అన్నదానం

భీమునిపట్నం (రూరల్), మార్చి 9 : ముకుందపురం సమీపంలో ఉన్న ఉమారామలింగేశ్వరాలయంలో శనివారం భారీ అన్నసంతర్పణ నిర్వహించారు. జాగరణ చేసిన చేసిన భక్తుల కోసం గ్రామానికి చెందిన గంగరాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

సినిమా గైడ్

- **భీమా :** మెలోడి, సంగం, శ్రీరామ, శారద, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య-2 (గాజువాక), నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్-2 (పెందుర్తి), సీతారామయ్య (పరవాడ), రాములమ్మ (తగరపువలస)
- **గామి :** జగదాంబ, శరత్, కామేశ్వరి, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), గణేష్ (తగరపువలస), నటరాజ్ (పెందుర్తి), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం),
- **ప్రేమలు :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మి (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **ఇంటి నెం.13 :** రమాదేవి, మోహిని (గాజువాక)
- **ఆపరేషన్ వాలెంటైన్ :** రమాదేవి, మౌర్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజవాక)
- **ఊరు పేరు భైరవకోన :** వెంకటేశ్వర, కామేశ్వరి, కన్య-2 (గాజువాక)
- **హనుమాన్ :** లీలామహల్, నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 24,టమాటా 17, వంకాయలు (తెలుపు) 2, వంకాయలు (నలుపు) 30, బెండకాయలు 268, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 40, బీరకాయలు 38, ఆనపకాయలు 12, కాలీఫ్లవర్ 24, క్యాబేజ్ 24, క్యారేట్ 24, దొండకాయలు 24, బంగాళా దుంపలు 18, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 42, అల్లం (పాతది) 115, బరబటి 16, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 110, గోరుచిక్కుడు 02, దోస కాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 150, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 50, ఆగాకర 52, పొటల్స్ 62, కీరదోస 28, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 54, చిలగడదుంపలు 26 , కంద 60, దేముడు చిక్కుడు 56, కొండఉసిరి 65, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 55, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	475
విజయనగరం	479
శ్రీకాకుళం	479

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	-- 105
ఫారం ధర	-- 125
విత్ స్కిన్	-- 220
స్కిన్‌లెస్	-- 230

మరికొన్ని సిటీ వార్తలు పేజీ I లో..



భీమిలి తీరంలో జన సందడి



జోడుగుళ్లపాలెం తీరంలో స్నానమాచరిస్తున్న భక్తులు



భక్తులతో కిటకిటలాడిన సాగర్‌నగర్ తీరం

భక్త జన తీరం

- సముద్ర స్నానాలకు పోటెత్తిన భక్తులు
- వేకువజాము నుంచే తాకిడి
- కిటకిటలాడిన భీమిలి
- జోడుగుళ్లపాలెం, రుషికొండ తీరంలో సందడే సందడి
- ఇబ్బందులు లేకుండా జీవీఎంసీ ఏర్పాట్లు
- పలుచోట్ల స్తంభించిన ట్రాఫిక్

భీమునిపట్నం/ఎండాడ, మార్చి 9 : తూర్పు, భీమిలి నియోజకవర్గాల పరిధిలోని తీర ప్రాంతాలు భక్తులతో కిటకిటలాడాయి.శివరాత్రి పురస్కరించుకుని శనివారం వేకువజామున మూడు గంటల నుంచే భక్తులు తీరానికి తరలివచ్చారు. భీమిలిలోని గోస్తనీ, సాగర సంగంలో పుణ్య స్నానాలకు పోటెత్తారు. అర్ధరాత్రి మూడున్నర నుంచి పోలీసులు సాగర సంగమ ప్రదేశంలో స్నాన ఘట్టాలకు నిర్ణయించిన ప్రదేశంలో బందోబస్తు చేపట్టారు. ఉదయం 8.30కు భీమిలి, విజయనగరం, ఎస్. కోట, పెందుర్తి, శ్రీకాకుళం ప్రాంతాల నుంచి వేలాది మంది బైకులు, కార్లు, ఆటోలు, వ్యాన్‌లపై తరలిరావడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి. దీంతో పోలీసులు పాత బస్టాండ్, నోవాటెల్, కేంబ్రిడ్జి జంక్షన్‌లో వాహనాల రాకపోకలను నిలిపివేసారు. విశాఖ నార్త్ ఏసీపీ సునీల్ పర్యవేక్షణలో భీమిలి, ఆనందపురం సీఐలు రమేష్, తిరుపతిరావు ఆధ్వర్యంలో వంద మంది సిబ్బందితో పాటు సీఐఎస్ఎఫ్ 25 మందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. సాగర సంగమ ప్రవేశద్వారం వద్ద ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నుంచి సీఐ రమేష్ భక్తులకు ఎప్పటికప్పుడు ప్రమాద హెచ్చరికలు జారీ చేశారు.నార్త్ సబ్ డివిజన్ ఏసీపీ సునీల్ సముద్ర స్నానాలను పర్యవేక్షించారు. సాయంత్రం వరకూ భక్తుల తాకిడి తగ్గలేదు.సుమారు 70 వేల మంది సముద్రస్నానాలు ఆచరించారని అధికారుల అంచనా.స్నానాలు తరువాత భక్తులు తీరంలో బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ సంఘం ఏర్పాటు చేసిన నందీశ్వరుని, జలోద్భవ శివలింగాలను దర్శించుకుని పూజలు చేశారు. అలాగే పురాతన శివాలయాలను దర్శించుకున్నారు.



బ్రహ్మకుమారీలు ఏర్పాటు చేసిన శివ లింగానికి పూజలు చేస్తున్న మహిళలు

స్వచ్ఛంద సంస్థల సేవ

సాగర వాకర్స్ అసోసియేషన్ భక్తులకు బిస్కెట్లు, అల్లం టీ పంపిణీ చేయగా శ్రీ వీరాంజనేయ అయ్యప్ప స్వామి సేవా సంఘం, ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆఫ్ భీమిలి సంయుక్తంగా చక్రపొంగలి, పులిహోర, బిరానీ, వాటర్ ప్యాకెట్లు అందజేశారు. చేపలుప్పాడ, మంగమారిపేట తీరాల్లోనూ భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. అక్కడ 4వ వార్డు కార్పొరేటర్ ఏడుకొండలరావు ఆధ్వర్యంలో పులిహోర పంపిణీ చేశారు. ఎస్ఐ హరీష్, సిబ్బంది బందోబస్తు చేపట్టారు. భీమిలి, తగరపువలస యూపీహెచ్‌సీ సిబ్బంది వైద్య శిబిరాలు నిర్వహించారు.

జోడుగుళ్లపాలెం తీరం కూడా జన సంద్రంగా మారింది. వేకువజాము 4 నుంచి భక్తులు తీరానికి పోటెత్తారు. 9వ వార్డు టీడీపీ అధ్యక్షుడు అక్కరబోయిన రాంబాబు, గరికిన నూకరాజు, మైలపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వేజెళ్ల సుబ్బరాజు, అన్నె రాజా, వెంపాడ శ్రీనివాసరెడ్డి, గొలగాని వెంకన్న,గరికిన శ్రీను, ఈగల కొండలరావు, గద్దిపిల్లి పెంటమ్మ, సబ్బి శివ, దబ్బి వెంకట్రావు పాల్గొన్నారు. వైసీపీ కార్పొరేటర్ స్వాతిదాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రసాద వితరణ కార్యక్రమంలో తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ పాల్గొని, భక్తులకు ప్రసాదం అందజేశారు.

మధురవాడ : మధురవాడ, పీఎంపాలెం, మిథిలాపురి వుడాకాలనీ, పిల్లకోమటివానిపాలెం, అయోధ్యనగర్, స్వతంత్రనగర్ కాలనీ, వాంబేకాలనీ, పోతిన మల్లయ్యపాలెం, హౌసింగ్ బోర్డు కాలనీల్లోని భక్తులు రుషికొండ, సాగర్‌నగర్, ఆర్కేబీచ్, జోడుగుళ్ళపాలెం తీరానికి వెళ్లి స్నానాలు ఆచరించారు.మధురవాడ ఐటీ జంక్షన్, మిథిలాపురి వుడాకాలనీ ప్రాంతాల్లో పలువురు ప్రసాదాలు, తాగునీరు అందించారు.

బోట్లపై రాజకీయ పార్టీల జెండాలు

ఎంవీపీ కాలనీ : అప్పుఘర్ లుంబినీ పార్కు సమీపంలోనూ పుణ్య స్నానాలు ఆచరించారు.భక్తులకు స్వాగతం పలుకుతూ రాజకీయ పార్టీలు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశాయి. వైసీపీ సముద్రంలో బోటుపై ఆ పార్టీ జెండాలను తగిలించారు. ఉదయం 8 నుంచి 10 వరకూ జోడుగుళ్లపాలెం నుంచి అప్పుఘర్ వరకూ ప్రధాన రహదారి వాహనాలతో కిక్కిరిసింది.

సాగర్‌నగర్ : రుషికొండ, సాగర్‌నగర్ తీరాలు కూడా భక్తులతో కిటకిటలాడాయి. నగరం నలుమూలలతో పాటు ఇతర జిల్లాలకు చెందిన వారు తీరానికి తరలిరావడంతో బీచ్‌రోడ్డులో విపరీతమైన ట్రాఫిక్ రద్దీ ఏర్పడింది. వేకువ జాము నుంచి సాయంత్రం వరకు భక్తులు జాగరణ స్నానాలు ఆచరించారు.



ప్రసాద వితరణలో పాల్గొన్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు



భక్తులకు ప్రసాదం అందిస్తున్న ఎంపీ సత్యనారాయణ



భీమిలి తీరంలో యువతుల పూజ



విద్యార్థులు, ఉపాధ్యాయులతో ఎన్‌సీఈఆర్‌టీ బృందం

ఇసుకతోట పాఠశాలను సందర్శించిన ఎన్‌సీఈఆర్‌టీ బృందం

ఎంవీపీ కాలనీ, మార్చి 9 : ఢిల్లీ నుంచి వచ్చిన ఎన్‌సీఈఆర్‌టీ బృందం శనివారం ఇసుకతోటలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలను సందర్శించింది. ఈ సందర్భంగా వారు విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాన్ని, పాఠశాలలో భద్రతా ప్రమాణాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బృంద సభ్యులు వీపీ సింగ్, సుహాసిని, శ్రీనివాసరావు, జి.లక్ష్మి, ఎంఈఓ బాలామణి, హెచ్ఎం నాగమణి, అంగన్‌వాడీ ఏసీడీపీఓ శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు

పద్మనాభం/పద్మనాభం (రూరల్), మార్చి 9 : మండలంలోని అనంతవరం గ్రామంలో శివన్నారాయణ ఆలయ ఆవరణలో శనివారం అన్నసమారాధన నిర్వహించారు. గ్రామ సర్పంచ్ గొర్రిపాటి వెంకటలక్ష్మి, పెద ఎర్రినాయుడు దంపతుల సహకారంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అనంతవరం, గొల్లలపాలెం, పెంట, తునిపాలెం, పేకెరు గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి శివన్నారాయణ స్వామి దర్శనం అనంతరం అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు అప్పల సూర్యనారాయణ, తాతాజీ, అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు. కాగా మండలంలోని పలు గ్రామాల్లో శివరాత్రి వేడుకలు శనివారంతో ముగిసాయి. పద్మనాభం, కృష్ణాపురం, మద్ది, విలాస్‌ఖాన్‌పాలెం, పొట్నూరు, రెడ్డిపల్లి, తునివలస, కుర్రపల్లి గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గెద్దపేటలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి సమేత లక్ష్మీగణపతి ఆలయంలో చంద్రమౌళీశ్వరస్వామికి రుద్రహోమం నిర్వహించారు. పద్మనాభం, మద్ది, తునిపాలెం గ్రామాల్లో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ రాంబాబు, టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు కె.నగేష్‌కుమార్, పద్దు, సత్యనారాయణ, అప్పలనాయుడు పాల్గొన్నారు.



అన్నదానంలో పాల్గొన్న సర్పంచ్ దంపతులు

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

పద్మనాభం, మార్చి 9 : మండలంలోని శేరిఖండం మాజీ సర్పంచ్ పుప్పాల ఆదినారాయణ మూడో వర్థంతి సందర్భంగా కుటుంబ సభ్యులు రెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన మెరిట్ విద్యార్థులకు శనివారం నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. పాఠశాలలో ఆరు నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన పది మందికి ఒక్కొక్కరికి రూ. వెయ్యి చొప్పున పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పల్లంటి చిన్నారావు, పాఠశాల హెచ్ఎం సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభంలో ముగిసిన షెటిల్ టోర్నమెంట్

పద్మనాభం, మార్చి 9 : పద్మనాభంలోని గోస్తనీ విద్యా పీఠ్ ఆవరణలో నిర్వహించిన మండల స్థాయి షెటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతలకు శనివారం నగదు బహుమతి ప్రదానం చేశారు. ఈ పాఠశాలలో 2014-15, 2018-19లో పదో తరగతి చదివి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కె. శ్రీను, కె. శంకర్ జ్ఞాపకార్థం పూర్వ విద్యార్థులు ఈ పోటీలు నిర్వహించారు. పోటీల్లో పది జట్లు పాల్గొన్నాయి. ప్రథమ స్థానం పొందిన మద్ది జట్టుకు రూ. 3 వేలు, ద్వితీయ బహుమతి పొందిన పద్మనాభం జట్టుకు రూ. 2 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు నగేష్‌కుమార్, కె. సూరిబాబు, టి. పైడిరాజు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు

పద్మనాభం, మార్చి 9 : పద్మనాభంలోని గోస్తనీ విద్యా పీఠ్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థుల పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం మహిళా దినోత్సవం పురస్కరించుకొని పాఠశాలలోని ఉపాధ్యాయినిలను, సిబ్బందిని సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకుడు కాళ్ల సూరిబాబు, హెచ్ఎం పైడిరాజు, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బలగాల కవాతు

గోపాలపట్నం, మార్చి 9 : ఎన్నికల నేపథ్యంలో కేంద్ర సాయుధ బలగాలు గోపాలపట్నం పీఎస్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం కవాతు నిర్వహించాయి. కొత్తపాలెంలోని నాగేంద్ర కాలనీ కూడలి నుంచి కొత్తపాలెం ప్రధాన రహదారిలో ఉన్న పోలింగ్ బూత్‌ల వరకూ కవాతు నిర్వహించారు.

నూకాలమ్మ దేవస్థానం నూతన పాలక మండలి



పాలక మండలి సభ్యులతో ఎమ్మెల్యే ముత్తంశెట్టి

భీమునిపట్నం, మార్చి 9 : పట్టణంలోని నూకాలమ్మ దేవస్థానం ఆలయ ధర్మకర్తల మండలి నూతన చైర్మన్‌గా వాసుపల్లి కొండబాబు నియామితులయ్యారు. అలాగే పాలక మండలి సభ్యులను నియమిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుతో కలిసి కొండబాబుతో పాటు సభ్యులు ముక్కి కృష్ణ, ఏనుగుతల సూర్యనారాయణ, కొంకిపూడి నూకరత్నం, గుర్ల శారద, కందివలస స్నేహలత, ధవళ అరుణ, తదితరులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి చౌదరి సత్యరాజు నూతన పాలక మండలి సభ్యులకు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు మైలపల్లి షణ్ముఖరావు, అల్లిపిల్లి నర్సింగరావు, వాసుపల్లి ఎల్లాజీరావు, వాడమొదల జగ్గారావు, కె. ఎర్రిబాబు, ప్రకాష్, పాల్గొన్నారు.

రైతులకు ప్లాస్టిక్ డ్రమ్ములు పంపిణీ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ రాంబాబు

పద్మనాభం (రూరల్), మార్చి 9 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కె. రాంబాబు చెప్పారు. శనివారం ఆయన కొత్తకొవ్వాడ, పాతకొవ్వాడ, పెంట, అనంతవరం, బాందేవుపురం గ్రామాల్లో ప్రధానమంత్రి అనుసుచిత జాతీయ అభ్యుదయ యోజన కింద ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు డ్రమ్ములు పంపిణీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రైతులు ద్రవ జీవామృతం, ఇతర కషాయాలు తయారు చేసుకోవడానికి డ్రమ్ములు వినియోగించి, అధిక పంట ఉత్పత్తులను సాధించాలన్నారు. జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగం నేచురల్ ఫార్మింగ్ అసోసియేట్ శ్రీనివాస చక్రవర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మోడల్ మేకర్ దుర్గారావు, మాస్టర్ ట్రైనర్ విద్యాసాగర్, తదితరులు పాల్గొన్నారు.

యువకుడు అదృశ్యంపై కేసు నమోదు

పద్మనాభం, మార్చి 9 : యువకుడు అదృశ్యమైన ఘటనపై శనివారం కేసు నమోదు చేసినట్టు పద్మనాభం పోలీసులు చెప్పారు. వారు తెలిపిన వివరాలు ప్రకారం.. మద్ది గ్రామానికి చెందిన కనకల ఎల్లమ్మ (27)కి బుగత వినోదినితో ఏడాది క్రితం వివాహమయ్యింది. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న ఎల్లమ్మ ఈనెల 6న ఉదయం 11 గంటలకు విశాఖపట్నంలో పరీక్షలకు హాజరు కావడానికి వెళ్లాడు. నాటి నుంచి ఇప్పటివరకు ఇంటికి చేరుకోలేదు. ఫోన్ కూడా స్విచ్ఛాఫ్ అయ్యింది. వెతికినా ఎక్కడ ఆచూకీ దొరకలేదు. దీంతో అతని భార్య వినోదిని పద్మనాభం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ శ్రీధర్ పర్యవేక్షణలో హెచ్‌సీ ఆనంద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైసీపీ పాలనలో ప్రజల ముంగిటకే పథకాలు

- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

పద్మనాభం, మార్చి 9 : వైసీపీ పాలనలో ఎటువంటి అవినీతి లేకుండా ప్రజల ముంగిటకు అన్ని పథకాలను అందిస్తున్నామని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చెప్పారు. శనివారం ఆయన పాండ్రంగిలో స్వయం సహాయక సంఘాల మహిళలకు వైఎస్సార్ చేయూత చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం జగన్ మహిళలకు ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీతో పాటు చేయూత పథకం ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నారన్నారు. అనంతరం మహిళా దినోత్సవం పురస్కరించుకుని మహిళా అధికారులు, ప్రజాప్రతినిధులు, ఎస్‌హెచ్‌జీ మహిళలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కె. రాంబాబు, డీఆర్‌డీఏ పీడీ శోభారాణి, ఎంపీడీఓ శైలజ, వైసీపీ మండల అధ్యక్షుడు లక్ష్మణరావు, సర్పంచ్ ఝాన్సీ, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌ఛార్జి అముజూరు అప్పా రావు, నాయకులు మహేష్, అప్పలనాయుడు, సూరప్పడు, ఆదిబాబు పాల్గొన్నారు.

సభ నుంచి వెనుదిరిగిన మహిళలు

కాగా చెక్కు పంపిణీ అనంతరం ముఖ్యమంత్రి జగన్ చిత్రపటానికి ఎమ్మెల్యే పాలాభిషేకం చేస్తుండగా మహిళలందరూ లేచి వెళ్లిపోయారు. వలంటీర్లు సమావేశానికి రాకపోతే చేయూత ఆర్థిక సాయం రాదని భయపెట్టి అందరినీ తీసుకువచ్చారని పలువురు ఆరోపిస్తున్నారు.



ఎంవీపీ కాలనీలో ప్రచారం చేస్తున్న చోడె పట్టాభిరామ్, తదితరులు

టీడీపీని గెలిపించండి : పట్టాభిరామ్

ఎంవీపీ కాలనీ, మార్చి 9 : వచ్చే ఎన్నికల్లో వైసీపీ పాలనకు చరమగీతం పలికి, టీడీపీని గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చోడె పట్టాభిరామ్ కోరారు. శనివారం ఆయన పార్టీ నాయకులతో కలిసి ఎంవీపీ కాలనీలోని పలు ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తూర్పు నియోజవర్గం ఎమ్మెల్యేగా వెలగపూడి రామకృష్ణబాబును, ఎంపీగా శ్రీభరత్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. ప్రజా సంక్షేమాన్ని కోరే పార్టీ తెలుగుదేశం అని, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండే వెలగపూడిని మరోసారి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో నాయకులు సత్తిబాబు, పూసపాటి రాజు, కళావతి, వీరస్వామి, శ్రీను, కోదండ, నరేంద్ర, వాసు, దేముడుబాబు పాల్గొన్నారు.

14 నుంచి బయోమెడికల్ డివైజ్ హ్యాక్‌థాన్

సాగర్‌నగర్, మార్చి 9 : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ అండ్ రీసెర్చి (జిమ్‌సర్) సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 14, 15 తేదీల్లో బయో మెడికల్ డివైజ్ హ్యాక్‌థాన్ పోటీలు నిర్వహించనున్నట్టు గీతం వీసీ ప్రొఫెసర్ దయానంద సిద్ధపట్టం తెలిపారు. శనివారం ఆయన ఇక్కడి విలేకరులతో మాట్లాడారు. వైద్య రంగంలో అవసరాలను గుర్తించి నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని దేశీయంగా అభివృద్ధి చేయడానికి యువతను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో జాతీయ స్థాయిలో ఈ హ్యాక్‌థాన్ నిర్వహిస్తున్నామని చెప్పారు. దేశంలో గుర్తింపు పొందిన విద్యా సంస్థల్లో పీజీ చేస్తున్న వారు, పీహెచ్‌డీ విద్యార్థులు పాల్గొనడానికి అర్హులని చెప్పారు. ఈనెల 15న జరిగే ఫైనల్స్‌లో విజేతలను ఎంపిక చేసి ప్రథమ బహుమతి కింద రూ. లక్ష అందజేస్తామన్నారు. పూర్తి వివరాలకు గీతం వెబ్‌సైట్‌ను సంప్రతించాలని ఆయన సూచించారు.

